## డీఎస్సీలో క్రీడాకారులకు అన్యాయం

నల్గొండ విద్యావిభాగం, న్యూస్‌టుడే: డీఎస్సీ-2024 క్రీడల కోటాలో ఉన్న 2శాతం రిజర్వేషన్‌ను క్రీడాకారులతోనే భర్తీ చేయాలని నిరుద్యోగ ఐకాస ఛైర్మన్ పాల్వాయి రవి డిమాండ్ చేశారు. డీఎస్సీ- 2004లో దరఖాస్తు చేసిన పలువురు క్రీడాకారులతో కలిసి బుధవారం ఆయన నల్గొండలోని పీఆర్టీయూ భవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జీవో నెంబర్ 74, జీవో నెంబర్ 107 ప్రకారం జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో, యూనివర్సిటీ స్థాయి పోటీల్లో పాల్గొని పతకాలు సాధించిన వారికి అవకాశం కల్పించకపోవడం అన్యాయం అన్నారు. స్పోర్ట్స్ కోటా కింద కేటాయించిన పోస్టులను క్రీడాకారులున్నప్పటికీ జనరల్ కింద మార్చి ఓపెన్‌లో ఇవ్వడం అన్యాయం అన్నారు. క్రీడా రిజర్వేషన్ 2శాతం కల్పించి ఉద్యోగవకాశాలు ఇవ్వాలన్నారు. ఈ విషయాన్ని మంత్రి, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. రాచకొండ రమేష్, శివ, సిరాజ్, విష్ణు, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నెలాఖరు వరకు సీఎంఆర్ చెల్లించాలి

నల్గొండ సంక్షేమం, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం గత ఖరీఫ్, రబీకి సంబంధించి సీఎంఆర్ చెల్లించే తేదీని అక్టోబరు 31వ తేదీ వరకు పొడిగించిందని.. మిల్లర్లు ఆ తేదీలోపు సీఎంఆర్‌ను చెల్లించాలని అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ ఆదేశించారు. సీఎంఆర్ సేకరణపై బుధవారం ఆయన కలెక్టరేట్‌లో సమీక్షించారు. గత ఖరీఫ్‌కు సంబంధించి ఇంకా 12వేల మెట్రిక్ టన్నులు, రబీలో 72వేల మెట్రిక్‌టన్నుల సీఎంఆర్‌ను మిల్లర్లు చెల్లించాల్సి ఉందన్నారు. ఈ నెలాఖరులోపు చెల్లించని మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్లు ప్రతి రోజు మిల్లుల నుంచి బియ్యం డెలివరీ అయ్యేలా చూడాలని ఆదేశించారు. వానాకాలం ధాన్యం కొనుగోలు ప్రారంభమైనందున రైస్‌మిల్లర్లు తక్షణమే మిల్లులకు కేటాయించాల్సిన జాబితాను సమర్పించాలన్నారు. రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం తీసుకోవాలని కోరారు. జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటేశ్వర్లు, జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ హరీష్, తదితరులు పాల్గొన్నారు.

# హృదయాలు మురిసేలా.. ఉయ్యాల పాట..!


బతుకమ్మ ఆడుతున్న మహిళలు

మోత్కూరు, న్యూస్‌టుడే:

ప్రకృతిని ఆరాధించే అతిపెద్ద పండగ బతుకమ్మ. ఏ పూజ చేసినా, కార్యక్రమం నిర్వహించినా పూలతో అలంకరించడం ఆనవాయితీ. కానీ ఆ పువ్వులనే దైవంగా పూజించే అరుదైన వేడుక ఇది. ఈ పండగ వచ్చిందంటే పిల్లల కేరింతలు, యువతుల ఆటలు.. అమ్మల పాటలు.. తొమ్మిది రోజులు మహిళల్లో కనిపించే ఉత్సాహం మాటల్లో చెప్పలేం. చిన్న ఊరైనా, పెద్ద పట్టణమైనా, దేశంలో ఎక్కడ ఉన్నా చివరికి విదేశాలైనా మనవాళ్లున్న చోట బతుకమ్మ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఎనిమిది రోజులపాటు ఆడుకున్న మహిళలు నేడు సద్దుల బతుకమ్మను పెద్దఎత్తున నిర్వహించేందుకు ఉమ్మడి నల్గొండ జిల్లా వ్యాప్తంగా సిద్ధమయ్యారు.

### ప్రత్యేక నైవేద్యం.. ఆరోగ్యం

ఎంగిలిపువ్వు నుంచి ఎనిమిది రోజుల పాటు ఆడుకుంటూ.. చివరి రోజున జరిపే వేడుకనే సద్దుల బతుకమ్మ. పెరుగన్నం, చిత్రాన్నం, కొబ్బరిపొడి, నువ్వులపొడి ఇలా.. ఐదురకాల సద్దులతో నైవేద్యం చేస్తారు. బతుకమ్మతో పాటే వివిధ కాల ఫలహారాలను చెరువు దగ్గరికి తెచ్చి పంచి పెడతారు. సత్తుపిండి, పల్లీముద్దలు, సజ్జపిండి పంచుతారు. సజ్జలు, బెల్లం, నెయ్యికలిపి చేసిన పిండి ముద్దలు.. ఇవన్నీ రక్తహీనతను



### నేడే సద్దుల బతుకమ్మ

తొలగించేందుకు ఉపయోగపడతాయి. పల్లీ ముద్దలు పిల్లలకు బలవర్ధకమైన ఆహారం. సత్తు పిండిగా పిలిచే మొక్కజొన్న పేలాల పిండిలో పీచు పదార్థం వల్ల మలబద్ధకం తగ్గుతుంది.

ఒక్కేసి పువ్వేసి చందమామ
ఒక్కజాములాయె చందమామ
శివపూజ వేళాయె చందమామ
శివుడుజాడలేదు చందమామ
గంగని వాకిట చందమామ
బంగారు పాకోళ్లు చందమామ
రెండేసి పూలేసి చందమామ

రెండు జాములాయె చందమామ
★ 'ఇద్దరక్క చెల్లెళ్లాను ఉయ్యాలో
ఒక్కూరికిచ్చిరే ఉయ్యాలో
పెద్దలకువచ్చింది ఉయ్యాలో
పెత్రమాస ఉయ్యాలో
పిల్లలకువచ్చింది ఉయ్యాలో
బతుకమ్మ పండుగ ఉయ్యాలో

### ఇస్సిన్నమ్మ వాయినం..

బతుకమ్మను చెరువుల్లో నిమజ్జనం చేసి బతుకమ్మను పేర్చిన పళ్లాలు, పళ్లెంలో నీరు తెస్తారు. అందులో గౌరమ్మను ఉంచి పాటలు పాడుతూ, ఒలలాడిస్తారు. మరో ఆసక్తికర అంశం వాయినం. అదివరకు సేకరించిన పూలను పంచుకోవడంతో మొదలవుతుంది. ఫలహారాన్ని పరస్పరం ఒకరికి ఒకరు ఇచ్చుకుంటారు. సద్దుల బతుకమ్మరోజు చెరువుగట్టుకు మలీదముద్దలు తీసుకుని వెళ్తారు. రాగి, జొన్నలు, గోధుమలతో గానీ, బియ్యంతోగానీ తయారైన పిండితో రొట్టెచేసి వాటిని చిన్నచిన్న ముక్కలుగా చేసి దంచి బెల్లం పాకంతో కలిపి మలీద ముద్దలను తయారు చేస్తారు. వీటిని బతుకమ్మ వాయినాలుగా ఇచ్చిపుచ్చుకుంటారు.

### సద్దులు ఇలా..

పెసరముద్దలు.. పెసర్లను ఉడకబెట్టి అందులో బెల్లం కలిపి ముద్దలుగా తయారు చేస్తారు.

సజ్జముద్దలు.. ఈ పండగొస్తే అందరికీ సద్దముద్దలు(సజ్జముద్దలు) గుర్తుకొస్తాయి. ఈ పేరుతోనే పెద్దబతుకమ్మను సద్దుల బతుకమ్మ అంటారని చెబుతారు. ప్రస్తుతం సజ్జలు అంతగా లభించడం లేదు. సద్దలను పిండిగా చేసిన సజ్జ రొట్టెలు చేస్తారు. రొట్టెలను, బెల్లాన్ని కలిపి దంచి ముద్దలు చేస్తారు.

సత్తుపిండి.. సత్తుపిండిని మొక్కజొన్నలతో చేస్తారు. దీనికి కూడా బెల్లం జోడిస్తారు.

నువ్వుల.. నువ్వులను పొడిచేసి బెల్లంతో ముద్దలు చేస్తారు. పల్లిపిండి.. కొబ్బరిపిండి.. పెరుగన్నం.. పులిహోరలను ఈమధ్య సద్దిగా ఇస్తున్నారు. పెరుగన్నంలో పల్లీలు, వివిధ రకాల ధాన్యాలను కలుపుతున్నారు. చింతపండు లేదా నిమ్మరసంలో చేసిన పులిహోర కూడా ప్రసాదంగా వాడుతున్నారు.

### మహిళలకు పెద్ద పండుగ..



- డాక్టర్ బండారు సుజాతశేఖర్ (దేవరకొండ, బతుకమ్మపై పరిశోధకురాలు)

మహిళలకు బతుకమ్మ పండగ ఎంతో పెద్దది. తరతరాలుగా పూలను పూజించే గొప్ప వేడుక ఇది. ఎంతో విశిష్టత కలిగిన ఈ పండగ మన తెలంగాణలో ఏ దేశంలో ఉన్నా అక్కడ జరుపుకొంటున్నారు. దీని ప్రాశస్త్యం భావితరాలకు అందించాల్సిన అవసరం ఉంది.

### పల్లెల్లో సంబరం అంతాఇంతా కాదు..



- పోరెడ్డి రాజేశ్వరి (ఉపాధ్యాయిని, ఆలేరు)

పల్లెల్లో ఈ పండగ వచ్చిందంటే మహిళల్లో ఎంతో సంతోషం కనిపిస్తుంది. చిన్నా, పెద్దా అంతా కలిసి ఆడుకోవడంలోనే బతుకమ్మ ప్రాధాన్యం ఉంటుంది. ఇంకా గ్రామాల్లో డీజేలకు బదులుగా పాటలు పాడుతూ ఆడుకుంటున్నారు. నాటితరం వారే బతుకమ్మ పాటలు పాడుతున్నారు. నేటితరం వారూ ఆ పాటలు నేర్చుకుని పండగ ఖ్యాతిని భావితరాలకు అందించాలి.

## బతుకమ్మ ఆడి.. బహుమతులు గెలుచుకుని


నల్గొండ: ఎన్జీ కళాశాలలో నిర్వహించిన బతుకమ్మ పండగ ఉత్సవంలో పాల్గొన్న అదనపు కలెక్టర్లు జె.శ్రీనివాస్, టి.పూర్ణచంద్ర, మహిళా అధికారులు, ఉద్యోగినులు

నల్గొండ విద్యావిభాగం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో బతుకమ్మ పండగకు ఎంతో విశిష్టత ఉందని అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ తెలిపారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు నల్గొండ జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ఎన్జీ కళాశాల మైదానంలో నిర్వహించిన బతుకమ్మ సంబురాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లాలోని వివిధ శాఖల మహిళా అధికారులు, ఉద్యోగినులు పెద్ద ఎత్తున తరలివచ్చి బతుకమ్మ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారన్నారు. గురువారం సద్దుల బతుకమ్మ ఉత్సవాలు వల్లభరావు చెరువు వద్ద నిర్వహించనున్నట్లు చెప్పారు. పట్టణ మహిళలతో పాటు ఆయా శాఖల ఉద్యోగినులు పెద్ద ఎత్తున తరలివచ్చి బతుకమ్మ ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర మాట్లాడుతూ బతుకమ్మ పండగ ప్రత్యేకంగా పూలపండగ అని తెలిపారు. మహిళలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. బాలసదనం బతుకమ్మ మొదటి బహుమతిని గెలుచుకోగా, ఆర్డీవో కార్యాలయం ద్వితీయ బహుమతిని, పుర కమిషనర్ మెప్మా తృతీయ బహుమతిని గెలుపొందాయి. విద్యుత్‌శాఖ, ఐసీడీఎస్ తిప్పర్తి శాఖలు ప్రోత్సాహక బహుమతులు గెలుచుకున్నాయి.

## మూసీకి కొనసాగుతున్న వరద


నిండుకుండలా మూసీ జలాశయం

కేతేపల్లి, న్యూస్‌టుడే: వర్షం తగ్గినప్పటికీ మూసీ ఎగువ ప్రాంతాల వాగులు, వంకల నుంచి వరదనీటి రాక కొనసాగుతుంది. దీంతో బుధవారం మూడో నెంబర్ క్రస్టు గేట్ ద్వారా దిగువ మూసీకి అధికారులు నీటిని విడుదల చేశారు. గేటును ఒక అడుగు ఎత్తుమేర లేపి 659 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఆయకట్టులో వరి పొలాల సాగుకు ప్రాజెక్టు ప్రధాన కుడి, ఎడమ కాలువల ద్వారా 413 క్యూసెక్కుల నీటిని వదిలారు. గేట్లు, కాలువలకు, ఆవిరి, మోటార్ల ద్వారా కలిపి మొత్తం 1129 క్యూసెక్కుల నీరు విడుదలవుతుంది. ఎగువ ప్రాంతాల నుంచి 1498 క్యూసెక్కుల వరద నీరు వస్తుంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 645 అడుగులు కాగా బుధవారం రాత్రి వరకు 644.40 అడుగుల నీరు రిజర్వాయర్‌లో ఉంది. రిజర్వాయర్ నీటి నిలువ సామర్థ్యం 4.46 టీఎంసీలు కాగా 4.31 టీఎంసీల నీరు రిజర్వాయర్‌లో నిలువ ఉంది.

# అయ్యో.. భీమారం..!


భీమారం శివారులో గుంతలమయంగా రహదారి

కేతేపల్లి, న్యూస్‌టుడే: ఆ రహదారి సమస్య ఎన్నో ఏళ్ల నాటిది. మూడు నియోజకవర్గాలను కలుపుతూ విస్తరించి ఉన్నా.. విస్తరణకు నోచుకోవట్లేదు. ఆ ముగ్గురు ఎమ్మెల్యేలు పట్టించుకోకపోవడంతో దశాబ్దాలుగా కొత్త రహదారి నిర్మాణానికి నోచుకోవట్లేదు. సరైన మరమ్మతులకు కూడా అడుగు ముందుకు పడటంలేదు. ఇది సూర్యాపేట నుంచి భీమారం మీదుగా మిర్యాలగూడకు వెళ్లే రహదారి దుస్థితి.

☛ ఉమ్మడి జిల్లాలో ప్రధానమైన సూర్యాపేట- మిర్యాలగూడ పట్టణాల మధ్య కేతేపల్లి మండలం భీమారం మీదుగా ఉన్న రహదారి అభివృద్ధి పనులు ఏళ్లతరబడి పూర్తి కావడం లేదు. దీంతో ప్రతినిత్యం ఆ రహదారిపై ప్రయాణించే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రహదారి సూర్యాపేట, నకిరేకల్, మిర్యాలగూడ శాసనసభ నియోజకవర్గాల్లో విస్తరించి ఉంది. అయినా.. ఈ పనిని పూర్తిచేసే విషయంలో సంబంధిత ఎమ్మెల్యేలు పట్టించుకోవడంలేదనే విమర్శలున్నాయి.

☛ పదేళ్ల క్రితం ప్రారంభమైన రెండు వరుసల రహదారి పనులు మూడు, నాలుగు సార్లు నిలిచిపోయాయి. చేసిన పనులకు బిల్లులు రావడంలేదని.. ప్రస్తుతం పెరిగిన ధరలకు అనుగుణంగా ధరలు పెంచాలనే సాకుతో గుత్తేదారు పనులను నిలిపివేశారు. పనులు మొత్తం పూర్తయితేనే బిల్లులు చెల్లిస్తామని అధికారులు సంబంధిత గుత్తేదారుడితో తేల్చి చెప్పారు. కొత్త రహదారి పనులు పూర్తికాక.. పాత రహదారికి మరమ్మతులు చేయకపోవడంతో రహదారిపై పలుచోట్ల గుంతలు ఏర్పడ్డాయి. చాలా చోట్లా కేవలం కంకర పోసి బీటీ వేయకుండా వదిలేశారు.


మూడేళ్లుగా నిలిచిన కల్వర్టు రక్షణగోడ నిర్మాణం

☛ భీమారం నుంచి శెట్టిపాలెం వరకు వంతెన పనులు నిలిపేశారు. వంతెనల వద్ద రహదారి కుంగిపోయి ప్రమాదకరంగా మారింది. ఇటీవల వంతెన కుంగిపోవడంతో సూర్యాపేట- మిర్యాలగూడ పట్టణాల మధ్య రెండుమూడు రోజుల పాటు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. సమస్య తీవ్రంగా ఉన్నా.. ఈ రహదారిపైన దృష్టి సారించడంలో ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు విఫలమయ్యారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గతంలోనూ అధికార పార్టీకి చెందిన వారే ఎమ్మెల్యేలుగా ఉన్నారు. ప్రస్తుతం సూర్యాపేట మినహా మిగిలిన ఇద్దరు ఎమ్మెల్యేలు అధికార పార్టీకి చెందిన వారే ఉన్నా.. రహదారి పనులు పూర్తి చేయించడంలో ఆశించిన స్థాయిలో చొరవ చూపడంలేదనే ఆరోపణలున్నాయి.

### చర్యలు తీసుకుంటాం:

- సత్యనారాయణరెడ్డి, ఈఈ, ఆర్‌అండ్‌బీ

రహదారిలో ప్యాచ్‌వర్కులు, వంతెనల నిర్మాణం, అసంపూర్తి పనులు పూర్తిచేయించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటాం. వివిధ కారణాలతో పనులు నిలిచిపోయాయి. అన్నింటినీ సమీక్షించి రహదారి పనులు పూర్తి చేయిస్తాం.


నల్గొండ ఎన్జీ కళాశాలలో ఖోఖో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న మంత్రి వెంకట్‌రెడ్డి

## విద్యార్థులు క్రీడల్లో రాణించాలి: మంత్రి

నల్గొండ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం నల్గొండ ఎన్జీ కళాశాల మైదానంలో ఖేలో ఇండియా ఉమెన్ ఖోఖో తెలంగాణ రాష్ట్ర జట్టు ఎంపిక కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి ఎంతో కృషి చేస్తుందని తెలిపారు. విద్యార్థులు క్రీడల్లో రాణించేలా తల్లిదండ్రులు, విద్యా సంస్థల యాజమాన్యాలు ప్రోత్సహించాలని కోరారు. నల్గొండ జిల్లా క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయస్థాయి పోటీల్లో సత్తా చాటాలని కోరారు. విద్యార్థులకు ట్రాక్ షూట్స్ ఇప్పించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పోటీల్లో ప్రతిభ గల వారిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. ఖోఖో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కృష్ణమూర్తి, ఆర్డీవో శ్రీదేవి, డీఎస్పీ శివరాం రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.





# నయనం.. ఎటువైపు పయనం..!


మిర్యాలగూడలోని ఓ పాఠశాలలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు (పాత చిత్రం)

◆ నేడు 'ప్రపంచ దృష్టి దినోత్సవం'

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: ఇటీవలి కాలంలో వయస్సుతో సంబంధం లేకుండా రెండేళ్ల చిన్నారి నుంచి 70 ఏళ్ల వృద్ధుడి వరకు ప్రతి ఒక్కరు కంటి సమస్యలతో బాధపడుతూ.. కళ్లకు అద్దాలతో దర్శనమిస్తున్నారు. ప్రస్తుత కాలంలో అన్ని వయస్సుల వారు చరవాణి, ల్యాప్‌టాప్, కంప్యూటర్, టీవీ తెరలకు అతుక్కుపోతుండటంతో ఇందుకు కారణం. కంటిపై ఒత్తిడి పెరిగి చూపు మందగిస్తుంది. శరీరంలో అత్యంత ప్రధానమైన కళ్లను కాపాడాలనే ఉద్దేశంతో ఏటా అక్టోబరు రెండో గురువారం 'ప్రపంచ దృష్టి దినోత్సవం' నిర్వహిస్తున్నారు.

### ఉమ్మడి జిల్లాలో ఇటీవల కాలంలో చేపట్టిన కంటి పరీక్షలు, సమస్యలు ఉన్న వారి వివరాలు..

| జిల్లా | పరీక్షించిన విద్యార్థులు | సమస్యలు ఉన్నవారు |
|---|---|---|
| నల్గొండ | 48,794 | 2,960 |
| సూర్యాపేట | 26,177 | 841 |
| యాదాద్రి | 13,710 | 931 |

### ప్రభుత్వ చర్యలు..

పిల్లల్లో కంటి సమస్యలు అధికంగా వస్తున్నాయని గ్రహించిన ప్రభుత్వం వారికి చికిత్స అందించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతోంది. ఆర్బీఎస్కే, నేత్ర వైద్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ఐదో తరగతి నుంచి పదో తరగతి విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. గత నెల 20 నుంచి ఈ నెల 2 వరకు నల్గొండ జిల్లాలో సుమారు 48,794 మందికి పరీక్షలు నిర్వహించగా.. 2,960 మందిలో సమస్యలు ఉన్నట్లు గుర్తించారు, సూర్యాపేట జిల్లాలో మొత్తం 26,177 మందికి పరీక్షలు నిర్వహించగా.. 841 మందిలో సమస్యలు ఉన్నట్లు గుర్తించారు. సమస్యలు ఉన్న వారికి చికిత్స అందించేందుకు సిఫారసు చేశారు.

### నల్గొండ జిల్లాల్లో ఆర్బీఎస్కే వైద్య బృందం, చేసిన పరీక్షల వివరాలు...

| ఆర్బీఎస్కే వైద్యాధికారి | కేంద్రం | పరీక్షల సంఖ్య |
|---|---|---|
| నితిన్ | మిర్యాలగూడ | 6,527 |
| గణేష్ | మిర్యాలగూడ | 6,372 |
| రాంరెడ్డి | నకిరేకల్ | 6,077 |
| దయానంద్ | మర్రిగూడ | 6,243 |
| విజయ్‌కుమార్ | మర్రిగూడ | 5,700 |
| నర్సింహ | దేవరకొండ | 5,935 |
| మల్లేష్ | దేవరకొండ | 6,105 |
| రాంబాబు | హాలియా | 5,835 |

### పాటించాల్సిన నియమాలు..

☛ ప్రతి 20 నిమిషాలకు ఒకసారి తెర నుంచి దృష్టిని మరల్చాలి.
☛ తెర వెలుతురు కంటే బయటి వెలుతురు ఎక్కువ ఉండేలా చూడాలి.
☛ రోజులో రెండు గంటలకంటే ఎక్కువ సేపు తెరలను చూడకపోవడం మంచిది.
☛ ధూమపానం కళ్లను పొడిబారేలా చేసి.. కంటి చూపును దెబ్బతీస్తుంది.
☛ అపరిశుభ్రమైన చేతులతో కళ్లను తాకడం వల్ల ఇన్‌ఫెక్షన్ సోకే ప్రమాదం ఉంది.
☛ సరిపడా నీళ్లు తాగడం వల్ల కళ్లలో తేమ శాతం పెరిగి కంటి సమస్యలు నివారించవచ్చు.
☛ కంటి ఆరోగ్యాన్ని రక్షించుకోవడానికి విటమిన్ ఏ, సి, ఈ అధికంగా ఆహారాలు తరచుగా తీసుకోవాలి.

### పిల్లల్లో పెరిగిన కంటి సమస్యలు:




డాక్టర్ బీసం కిరణ్, కంటి వైద్యుడు, ప్రాంతీయ వైద్యశాల, మిర్యాలగూడ

కరోనా అనంతరం మారిన పరిస్థితుల కారణంగా మూడేళ్ల వయసు పిల్లల నుంచే కంటి సమస్యలు రావడం మొదలైంది. దీనికి ప్రధాన కారణం ఫోన్, టీవీ వంటి తెరలను పరిమితికి మించి చూడటం. రోజులో కేవలం 30 నిమిషాలు మాత్రమే పిల్లలు తెరలు చూసేలా కట్టడి చేయాలి. నిత్యం కనీసం రెండు గంటల పాటు మైదానంలో ఆటలాడటం వల్ల దూరపు చూపు అలవాటవుతోంది. మధ్య వయస్కుల్లో వచ్చే చత్వారం, శుక్లాల సమస్యను చికిత్సతో నయం చేయొచ్చు. కంప్యూటర్ తెరలను అదే పనిగా చూసే ఉద్యోగులు కనీసం గంటకోసారి రెండు నిమిషాల పాటు కళ్లు మూసుకోవాలి.

### పరీక్షల్లో వెలుగు చూసిన అంశాలు ఇలా..

☛ త్రిపురారం మండలం రాగడప గ్రామానికి చెందిన ఓ బాలికకు రెటీనాస్ డిసీస్ కారణంగా పుట్టుకతోనే కంటిలో శుక్లాలు ఉండగా.. 15 సంవత్సరాల వయస్సులో గుర్తించి.. శస్త్రచికిత్సకు సిఫారసు చేశారు.
☛ మిర్యాలగూడ జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో ఓ విద్యార్థినికి శుక్లాలు వచ్చినట్లు గుర్తించి శస్త్ర చికిత్సకు సిఫారసు చేశారు.
☛ మిర్యాలగూడలోని ఏడు కోట్ల తండాకు చెందిన ఓ బాలుడు పుట్టుకతోనే ఎమారోసిస్ అనే వ్యాధి బారిన పడి కంటి చూపు మందగించడం గుర్తించారు.
☛ మిర్యాలగూడకు చెందిన ఓ ఎల్కేజీ విద్యార్థికి కంటి పరీక్షలు చేయగా.. మైనస్ 8గా నమోదు కావడంతో వైద్యులు కంగుతిన్నారు.
☛ ఓ ఆరేళ్ల బాలుడికి కంటి పక్షవాతం ఉన్నట్లు గుర్తించి శస్త్ర చికిత్స చేసి సరి చేశారు.



# మహిషాసుర సంహారం.. విశిష్టతల సమాహారం

మఠంపల్లి, న్యూస్‌టుడే: హిందువుల ముఖ్యమైన పండగలలో ప్రధానమైన దసరాకు ఎన్నో విశిష్టతలు ఉన్నాయి. తొమ్మిది రోజుల పాటు ఆధ్యాత్మిక వాతావరణంలో భక్తిపారవశ్యంతో గడిపే ఈ నవరాత్రుల్లో శక్తి ఆరాధనకు ప్రాధాన్యమిస్తారు.

◆ శరదృతువు ఆరంభంలో వచ్చే ఈ పర్వదినాన్ని శరన్నవరాత్రిగా, జగన్మాత మహిషాసురుడితో తొమ్మిది రాత్రులు యుద్ధం చేసి ఆ రాక్షసుడిని వధించిన రోజును విజయదశమిగా వ్యవహరిస్తారు. పలు ప్రాంతాలలో మొదటి మూడు రోజులు పార్వతీదేవిని, తదుపరి మూడు రోజులు లక్ష్మీదేవిని, చివరి మూడు రోజులు సరస్వతీదేవిని ఆరాధిస్తారు. ఇదే రోజు శ్రీరాముడు రావణుడిపై విజయం సాధించడం, పాండవులు వనవాసానికి వెళ్తూ జమ్మిచెట్టుపై ఉంచిన తమ ఆయుధాలను తిరిగి తీసుకున్నారని పురాణ కథనం.


మట్టపల్లి: నవరాత్రుల్లో పూజలందుకుంటున్న దుర్గాదేవి

◆ దుర్గాష్టమి నాడు అమ్మవారు మహిషాసుర మర్దినిగా దర్శనమిస్తుంది. మహిషం అంటే దున్నపోతు(పశువు). పశుత్వం నుంచి అసుర(రాక్షస) శక్తులు వస్తాయి. తద్వారా దుష్టబుద్ధులు, దురాచారాలు ప్రబలుతాయి. వాటిని మర్దనం చేసే తల్లిగా కనకదుర్గ మహిషాసుర మర్దినిగా అవతరించింది. విజయదశమి రోజు జగన్మాత శ్రీరాజరాజేశ్వరీదేవిగా దర్శనమిస్తుంది. నాలుగు చేతుల్లో పాశం, అంకుశం, చెరుకుగడ, పుష్ప బాణం ధరించి అపరాజితాదేవిగా, దివ్యమంగళ స్వరూపిణిగా సాక్షాత్కరిస్తుంది.

**శమీపూజకు ప్రాధాన్యం:**

–ఫణిశర్మ ఘనపాటి, ఎస్ఎల్ఎన్ వేద పాఠశాల అధ్యాపకుడు, మట్టపల్లి

శమీ అంటే జమ్మిచెట్టు. ఎంతో ప్రాశస్త్యం ఉన్న ఈ వృక్షాన్ని విజయదశమి రోజు ఆరాధించడం లక్ష్మీప్రదం. పూజల అనంతరం శమీ పత్రాలను దేవుని మందిరాలలో, నగదు భద్రపరిచే పెట్టెలలో ఉంచాలి. 'శమీ శమయతే పాపం శమీశత్రు వినాశనీ.. అర్జునస్య ధనుర్ధారీ రామస్య ప్రియదర్శినీ' శ్లోకాన్ని స్మరిస్తూ శమీ వృక్షం చుట్టూ ప్రదక్షిణలు చేశాక శ్వేత పత్రంపై ఈ శ్లోకం రాసిన కాగితాలను చెట్టు కొమ్మలకు తగిలించాలి. దీనివల్ల అభీష్టాలు నెరవేరతాయి.

## విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగి ఆత్మహత్య

చౌటుప్పల్‌గ్రామీణం, న్యూస్‌టుడే: అనారోగ్యంతో బాధపడుతున్న విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగి పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన చౌటుప్పల్‌లో చోటుచేసుకుంది. చౌటుప్పల్‌కు చెందిన బాతరాజు నర్సింహ(62) సంస్థాన్‌నారాయణపురంలోని ఎంపీడీవో కార్యాలయంలో అటెండర్‌గా పని చేసి ఉద్యోగ విరమణ పొందారు. పదేళ్లుగా పక్షవాతంతో బాధపడుతున్నాడు. ఆరోగ్యం సహకరించకపోవడంతో మనస్తాపం చెంది మంగళవారం రాత్రి ఇంట్లో పురుగు మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డారు. గమనించిన కుటుంబ సభ్యులు మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ నర్సింహ మంగళవారం అర్ధరాత్రి సమయంలో మృతి చెందారు. మృతుని భార్య సుగుణమ్మ ఫిర్యాదు మేరకు ఎస్సై యాదగిరి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ ఇన్‌స్పెక్టర్ మన్మథకుమార్ తెలిపారు.

# అందమైన ఉపాధి..!


హీరోయిన్ రితికా సింగ్‌కు మేకప్ చేస్తున్న నాగవెల్లి వెంకట్

మిర్యాలగూడ, న్యూస్‌టుడే:

జీవనోపాధి కోసం చేసే కుల వృత్తిని ఆధునిక అవసరాలకు తగిన విధంగా మెరుగు పరచుకుని.. తనదైన్ణశైలిలో సెలబ్రిటీలకు, ప్రముఖులకు అందాలను మెరుగుల ద్దుతూ తాను ఉపాధి పొందుతూ మరో పది మందికి ఉపాధి కల్పిస్తున్నాడు మిర్యాలగూడ పట్టణానికి చెందిన 'వెంకీస్ హెయిర్ అండ్ బ్యూటీ ఫ్యామిలీ సెలూన్' నిర్వాహకుడు నాగవెల్లి వెంకట్.

★ పట్టణానికి చెందిన నాగవెల్లి రాము, లక్ష్మమ్మ దంపతుల కుమారుడు వెంకట్ డిగ్రీ చదువుతూనే పార్ట్‌టైం సెలూన్‌లో పనిచేసేవాడు. ఆధునిక హెయిర్ స్టైల్‌పై అవగాహన పెంపొందించుకున్న ఆయన డిగ్రీ పూర్తి కాగానే 2009లో హైదరాబాద్‌కు వెళ్లి 'మానియా', మిర్రర్ వంటి సంస్థల్లో చేరి శిక్షణ పొందాడు. 2014లో మిర్యాలగూడకు వచ్చి బబుల్స్‌ను ఏర్పాటు చేశాడు. ప్రస్తుతం వెంకీస్ పేరుతో మరో సెలూన్‌ను ఏర్పాటు చేశాడు. తనదైన్ణశైలిలో ప్రముఖులకు, సెలబ్రిటీలకు, సినిమా హీరోలు, హీరోయిన్‌లకు హెయిర్ స్టైలిస్ట్, మేకప్ మెన్‌గా పనిచేస్తున్నాడు. మిర్యాలగూడలో తన సంస్థలో పది మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తూ.. హైదరాబాద్‌కు వెళ్లి ఆర్డర్లపై వివాహాలు, సినిమా షూటింగ్‌లకు మేకప్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. సినీ హీరో చిరంజీవి కుటుంబానికి మేకప్ మెన్‌గా పనిచేస్తున్న 'టీను'తో కలిసి నాగవెల్లి వెంకట్ పనిచేస్తున్నాడు. ఇప్పటి వరకు సానియా మీర్జా, పి.వి సింధూ, హీరోయిన్లు శివాత్మిక, రితికాసింగ్, నిత్యాశెట్టి, హీరోలు అడవిశేషు, సహాయ, సీరియల్ నటులకు సైతం మేకప్ చేస్తున్నాడు. ఆసక్తి కలిగిన యువతకు శిక్షణ ఇచ్చి వారిని ప్రోత్సహిస్తానని చెబుతున్నాడు నాగవెల్లి వెంకట్.

# హాయిగా వెళ్లొచ్చిక..!


సూర్యాపేట బస్టాండ్‌లో బస్సు ఎక్కడానికి పోటీ పడుతున్న ప్రయాణికులు (పాతచిత్రం)

◆ పండగ వేళ ఆర్టీసీ ముందస్తు రిజర్వేషన్

భానుపురి, కుడకుడరోడ్డు(సూర్యాపేట), న్యూస్‌టుడే: దసరా పండగకు ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేసేందుకు ఆర్టీసీ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సంస్థకు ఆదాయాన్ని పెంచటం, ప్రయాణికుల రద్దీని తట్టుకుని మెరుగైన సేవలందించాలనే సంకల్పంతో ప్రత్యేక బస్సులను నడుపుతున్నారు. పండగల నేపథ్యంలో విద్యా, ఉద్యోగ, వ్యాపార, వాణిజ్య అవసరాల నిమిత్తం ఎక్కడెక్కడో ఉన్నవారు సైతం తమ సొంత ఊరిబాట పడుతున్నారు. దీంతో ఉమ్మడి నల్గొండ జిల్లాలోని బస్టాండ్‌లలో ప్రయాణికుల రద్దీ కనిపిస్తోంది.

**పర్యవేక్షణ ఇలా..**

ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. బస్టాండ్లను శుభ్రంగా ఉంచడంతోపాటు తాగునీటి వసతి కల్పిస్తున్నారు. డిప్యూటీ ఆర్ఎంలు, రీజియన్‌లోని డిపోల డీఎంలు, సూపర్‌వైజర్లు, ఇతర అధికారులు పర్యవేక్షణ చేపడుతున్నారు. రద్దీకి అనుగుణంగా బస్సులు నడిపేలా చర్యలు తీసుకుంటున్నారు.

**ఎంజీబీఎస్ నుంచి ప్రత్యేక బస్సులు..**


దసరా వేడుకల సందర్భంగా ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా జిల్లాకు చెందిన బస్సులే కాకుండా ఎంజీబీఎస్ (మహాత్మాగాంధీ బస్‌స్టేషన్) నుంచి 639 బస్సులను ఆర్టీసీ ఉన్నతాధికారులు ఉమ్మడి జిల్లాకు కేటాయించారు. ఈ నెల 15 వరకు బస్సులు ఆయా ప్రాంతాల్లో తిరగనున్నాయి. ప్రయాణికులు తమ గమ్యస్థానాలకు చేరుకునేందుకు ముందుగా ఆన్‌లైన్ రిజర్వేషన్ అవకాశం కల్పించారు. ప్రయాణికులు WWW.TGSRTCBUS.IN/ORS.WEB లో ముందస్తు టికెట్ రిజర్వేషన్ చేసుకొని తమ గమ్యస్థానాలకు సురక్షితంగా చేరుకోవచ్చు.

**సద్వినియోగం చేసుకోవాలి**

– రాజశేఖర్, ఆర్ఎం, నల్గొండ

దసరా పండగ సందర్భంగా ప్రయాణికులు ఆర్టీసీ వెబ్‌సైట్‌లో టికెట్ రిజర్వేషన్ చేసుకోవాలి. ఎంజీబీఎస్ నుంచి ఉమ్మడి జిల్లాకు 639 బస్సులే కాకుండా జిల్లాకు చెందినవి 640 నడుస్తున్నాయి. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

# పద్దు.. తారుమారు..!



నల్గొండ జిల్లా పరిషత్తు, న్యూస్‌టుడే: నల్గొండకు చెందిన నరేష్‌కుమార్ ఓ ఉద్యోగి. కొద్దిపాటి వేతనంతో కుటుంబ జీవనం సాగిస్తున్నారు. ప్రతి నెల ఇంటి అద్దె, పిల్లల ఫీజులు, ఇతర అవసరాలకు ప్రణాళిక ప్రకారం ఖర్చులు వెచ్చిస్తుంటారు. కొద్ది రోజులుగా కూరగాయల ధరలతో లోటు బడ్జెట్ ఎదుర్కొంటున్నారు. గత వారం రోజుల్లోనే నిత్యావసర వస్తువుల ధరలు అమాంతం పెరగడంతో అదనంగా రూ. రెండు వేల నుంచి రూ. మూడు వేల వరకు ఆర్థిక భారం పెరగడంతో నరేష్ లాంటి మధ్య తరగతి కుటుంబాలు ఆర్థిక పరమైన ఇబ్బందులతో సతమతమవుతున్నాయి.

❐ దసరా పండగ వేళ బియ్యం, కూరగాయల ధరలు ఆకాశన్నంటుతున్నాయి. మార్కెట్లల్లో వ్యాపారులు, దళారుల రాజ్యం నడుస్తోంది. గడిచిన వారం రోజుల్లోనే టమాట ధర నాలుగు రెట్లు పెరిగింది. ఒక కిలో రూ. 25 లభించగా, ప్రస్తుతం మార్కెట్లో కిలో రూ.100కు చేరుకుంది. దాని వెనుకాలే ఉల్లి, వెల్లుల్లితోపాటు మిగతా కూరగాయల ధరలు పరుగులు పెడుతున్నాయి. మరో పక్క సన్న బియ్యం క్వింటాల్ గత ఏడాది రూ.5600వరకు ఉండగా ప్రస్తుతం రూ. 6200 నుంచి రూ. 7 వేల వరకు మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. ఇక కంది పప్పు, పెసర, శనగ పప్పులు ఒక కిలోపై రూ. 5 నుంచి రూ. 40 వరకు అదనంగా పెరిగాయి.

❐ పండగల సీజన్‌లో ఒక్కసారే నూనెల ధరలు రెట్టింపయ్యాయి. గత నెలలో కిలో రూ.110 ఉన్న నూనె ప్రస్తుతం కిలో రూ.135 వరకు చేరింది. అంటే ఒక కిలోపై రూ.20 అదనంగా పెరిగింది. దీంతో 5 కిలోలు వాడుతున్న కుటుంబాలు 3 కిలోలు తగ్గించుకోవాల్సిన దుస్థితి నెలకొంది. జిల్లాలో ఐదు లక్షలకు పైగా కుటుంబాలున్నాయి. నెలకు 2.5 లక్షల లీటర్ల నూనె వినియోగం ఉంటుందని వ్యాపారుల అంచనా. ఈ లెక్క ప్రకారం రూ.9 కోట్ల ఆర్థిక భారం పడుతుంది. పర్వదినాలు రావడంతో పిండి వంటలకు నూనె వినియోగం తప్పని సరి కావడంతో ఏం చేయాలన్న మీమాంసలో ప్రజలు పడిపోయారు.

## అంతా చేరి..అమ్మను కొలిచి..!

దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నవశక్తి యూత్ ఆధ్వర్యంలో నార్కట్‌పల్లిలోని వేణుగోపాలస్వామి గుడి దగ్గర నెలకొల్పిన అమ్మవారి విగ్రహం వద్ద బుధవారం మహిళలు కనకపూజ, పసుపు కుంకుమ పూజ నిర్వహించారు. – న్యూస్‌టుడే, నార్కట్‌పల్లి గ్రామీణం



# ఆహ్లాదం.. ఆలయ నగరి



నారసింహుడి దర్శనానికి వచ్చే భక్తులను ఆహ్లాదకరమైన పరిసరాలు ఆహ్వానిస్తున్నాయి. చుట్టూ కొండల నడుమ పెద్దగుట్ట.. ఆ గుట్టపైనే భక్తుల బస కోసం ప్రత్యేక వసతుల ద్వారా నిర్మించనున్న ఆలయనగరి పచ్చదనంతో కనువిందుగొల్పుతోంది. పూల ప్రాంగణాలు ఆకట్టుకుంటున్నాయి. – న్యూస్‌టుడే, యాదగిరిగుట్ట

## పంటల రక్షకులుగా..
# డీలర్లకు శిక్షణ



కంపసాగర్ పరిశోధన కేంద్రంలో శిక్షణలో పాల్గొన్న శాస్త్రవేత్తలు, అధికారులు

నల్గొండ గ్రామీణం, న్యూస్‌టుడే: పంటల రక్షణలో ఎరువులు, పురుగు మందులు విక్రయించే డీలర్లు రైతులకు సలహాదారులుగా మారుతున్నారు. డీలర్లకు సరైన శిక్షణ అందిస్తే ఏ పంటలకు, ఎలాంటి ఎరువులు, ఎంత మోతాదులో ఇవ్వాలనే అవగాహన ఉంటుందని వ్యవసాయశాఖ భావించింది. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో డిప్లొమా ఇన్ అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ సర్వీసు ఫర్ ఇన్‌పుట్ డీలర్స్ (డీఏఈఎస్‌ఐ) కోర్సును కేంద్ర ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. శాస్త్రవేత్తలు, అనుభవం కలిగిన వ్యవసాయాధికారులతో ఏడాదిపాటు డీలర్లకు శిక్షణ అందివ్వనున్నారు.

◆ పంటల సాగులో మెలకువలు, తెగుళ్ల నివారణకు వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు తీసుకోవాల్సి ఉండగా.. చాలా మంది రైతులు నేరుగా డీలర్లను ఆశ్రయిస్తున్నారు. వారు సూచించే మందులు కొనుగోలు చేసి వాడుతున్నారు. దీంతో శిక్షణ తరగతుల్లో విత్తనాలు, వాతావరణ పరిస్థితులు, తెగుళ్లు, వైరస్‌లు సోకే దశ తదితర అంశాలపై శాస్త్రవేత్తలు డీలర్లకు వివరిస్తారు. ఏడాదిలో 48 తరగతులు నిర్వహిస్తున్నారు. 8 రోజుల పాటు క్షేత్ర స్థాయి సందర్శనలు ఉంటాయి. 40 రోజులు వ్యవసాయ అంశాలపై తరగతులు బోధిస్తున్నారు.

◆ నల్గొండ జిల్లా కంపసాగర్ కేవీకే కేంద్రంలో, మల్లేపల్లిలో ప్రస్తుతం వ్యవసాయశాఖ పరిధిలోని డీలర్లకు శిక్షణ ఇస్తున్నారు. గతేడాది నుంచి వారానికి ఒక రోజు చొప్పున ప్రతి విడతలో 40 మంది డీలర్లకు శిక్షణ నిర్వహిస్తున్నారు. క్షేత్ర స్థాయి సందర్శనలో విత్తనోత్పత్తి, ఆధునిక వ్యవసాయ సాగు పద్ధతులపై అవగాహన కల్పిస్తున్నారు. గతంలో పురుగు మందుల డీలర్ల ధ్రువీకరణ పత్రం పొందాలంటే తప్పనిసరిగా డిగ్రీలో బీఎస్సీ (రసాయన శాస్త్రం) చేసిన వారికే అవకాశం ఉండేది. ప్రస్తుతం పది ఉత్తీర్ణత సాధించి లైసెన్సు కలిగిన డీలర్లు ఈ శిక్షణకు హాజరై పరీక్ష రాసి ఉత్తీర్ణత సాధిస్తే ధ్రువీకరణ పత్రం పొందవచ్చు.

**దసరా తరువాత మరో రెండు బ్యాచ్‌లకు..**

ఉమ్మడి జిల్లాలో నల్గొండలోని డీఏవో కార్యాలయంలో రెండు బ్యాచ్‌లకు శిక్షణ ప్రారంభిస్తారు. యాదాద్రి భువనగిరి, సూర్యాపేట జిల్లాలో ఒక్కో బ్యాచ్‌కు శిక్షణ నిర్వహిస్తారు. డీలర్ల శిక్షణకు రూ. 10 వేలు, ఇతరులు శిక్షణ తీసుకుంటే రూ. 20 వేలు ఫీజు చెల్లించాల్సి ఉంటుంది.

**48 వారాలపాటు..**

పాల్వాయి శ్రవణ్‌కుమార్, జిల్లా వ్యవసాయాధికారి, నల్గొండ

విత్తన, ఎరువుల డీలర్లకు పూర్తిస్థాయిలో శిక్షణ ఇచ్చేందుకు ప్రభుత్వం ఈ కోర్సు అమలు చేస్తోంది. ఏడాదికి 48 వారాలపాటు ఈ శిక్షణ ఉంటుంది. కోర్సు పూర్తి చేసిన వారు విత్తన, పురుగు మందుల లైసెన్సు తీసుకోవచ్చు. పంటల సాగులో తీసుకోవాల్సిన చర్యలపై విత్తన, ఎరువుల డీలర్లతో పాటు ఇతరులు పూర్తి స్థాయిలో శిక్షణ ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది.

## ధాన్యం కొనుగోళ్లలో సమస్యలా..
## 99634 07064

నల్గొండ గ్రామీణం, న్యూస్‌టుడే: రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి బుధవారం నల్గొండ సమీపంలోని ఆర్జాల బాయి వద్ద ఏర్పాటు చేసిన కొనుగోలు ధాన్యం కేంద్రాన్ని ప్రారంభించారు. వానాకాలం ధాన్యానికి సంబంధించి రైతులకు ఏమైనా ఇబ్బందులు ఏర్పడినా, చెల్లింపుల్లో ఆలస్యమైనా జిల్లా పౌరసరఫరాల అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నెంబరు 9963407064కి ఫోన్ చేయాలని సూచించారు. పీఏసీఎస్ అధ్యక్షుడు నాగరత్నం రాజు అధ్యక్షత వహించగా.. అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, డీఎస్‌వో వెంకటేశ్వర్లు, పౌరసరఫరా శాఖ డీఎం హరీష్, వ్యవసాయశాఖ జేడీ శ్రవణ్‌కుమార్, మార్కెటింగ్ ఏడీ ఛాయదేవి, డీఆర్‌డీవో శేఖర్‌రెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ బుర్రి శ్రీనివాసరెడ్డి, వైస్ ఛైర్మన్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

| చికెన్ ధరలు | | | |
|---|---|---|---|
| ఫాంరేటు | 114-00 | డ్రెస్డ్ | 197-00 |
| రిటైల్ | 136-00 | స్కిన్‌లెస్ | 224-00 |

# గడువు పెంచారు..!


గోదాము ముందున్న బియ్యం లారీలు(పాత చిత్రం)

హుజూర్‌నగర్, న్యూస్‌టుడే: ఎట్టకేలకు కేంద్రం సీఎంఆర్ బియ్యం పెట్టేందుకు గడువు పెంచింది. ఈనెల 31 వరకు గడువు ఇచ్చింది. గతనెల 30 వరకు గడువు ఉన్నప్పటికీ వివిధ కారణాలతో మిల్లర్లు పూర్తి చేయలేకపోయారు. రాష్ట్ర ప్రభుత్వం సీఎంఆర్ బియ్యం పెట్టేందుకు గడువు ఇవ్వాలని కోరుతూ గత నెల 13నే కేంద్రానికి లేఖ రాసింది. ఇటీవలే భారత ఆహార సంస్థ.. సీఎంఆర్ బకాయి ఉన్న మిల్లుల్లో తనిఖీలు నిర్వహించి, గడువు పెంచి బియ్యం వసూలు చేయాలని నివేదిక ఇవ్వడంతో మరో నెల రోజులు గడువు పెంచింది. గతంలో 90 రోజులు గడువు పెంచిన ప్రభుత్వం ఈసారి ఒక నెల మాత్రమే అవకాశం ఇచ్చింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు ప్రస్తుతం పెడుతున్న సీఎంఆర్ బియ్యంపై గట్టి నిఘా ఉంచాలని, నిబంధనలకు అనుగుణంగా బియ్యం ఉండేలా చూడాలని, రేషన్ బియ్యం తిరిగి సీఎంఆర్‌కు రాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని తాజాగా ఇచ్చిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

**లక్ష్యం పూర్తికి అవకాశం..** ఎఫ్‌సీఐ అధికారులు ఇటీవల మూడు రోజుల్లో బకాయి మిల్లుల్లో తనిఖీలు నిర్వహించిన విషయం తెలిసిందే. మిల్లుల్లో ధాన్యం ఉన్నందున లక్ష్యాన్ని పూర్తి చేయవచ్చునన్న నివేదిక ఆధారంగానే గడువు పెంచారు. లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు రోజువారీ లక్ష్యాలను పెట్టి వసూలు చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. మరో వారంలో 2024-25 వానాకాలం సీజన్ ధాన్యం రాక ప్రారంభం అవుతుంది. కొన్న కొత్త ధాన్యాన్ని మిల్లులకు కేటాయించాలి. ప్రస్తుతం ఉన్న నిబంధన ప్రకారం బకాయి ఉన్న మిల్లులకు ధాన్యం ఇచ్చే అవకాశాలు లేవు. కాబట్టి మిల్లర్లు కూడా ఈసారి త్వరితగతిన తమ లక్ష్యాలను పూర్తి చేసే అవకాశం ఉంది.



## జ్ఞాపకం.. ఆయన వ్యాపకం

**★ 200 చరవాణి నంబర్లు ఏకబిగిన చెప్పడం ఈయన ప్రత్యేకత**

రాజపేట మండలం నెమిల గ్రామానికి చెందిన 77 ఏళ్ల వృద్ధుడు చదివింది కేవలం ఐదో తరగతే. అయినా ఏకబిగిన 200 చరవాణి నెంబర్ల వరకు ఎక్కడా చూడకుండా చెబుతుంటారు. తన చరవాణిలో ఇప్పటి వరకు ఒక్క నెంబరు కూడా నమోదు చేసుకోకపోవడం గమనార్హం. జిల్లా ఉన్నతాధికారులు మొదలుకుని ప్రజా ప్రతినిధులు, స్థానిక నాయకుల చరవాణి నెంబర్లను నోటికే చెప్పడం ఈయన ప్రత్యేకత. తన బంధువులు, గ్రామంలోని వారి నెంబర్లను కూడా ఇట్టే చెప్పేయగలరు. వ్యవసాయ సాగు పనికి ఉపయోగ పడే కూలీలవి, ఎరువుల దుకాణ యజమానులు, ట్రాక్టర్ల యజమానులు, డ్రైవర్లు, రైసుమిల్లు యజమానులవి గుర్తు పెట్టుకున్నారు. ఇటీవలనే మాజీలైన ఎంపీపీ, జడ్పీటీసీ సభ్యులవి, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులవి కళ్లుమూసుకుని టకటకా చెబుతూనే ఉంటారు రాజిరెడ్డి. తన బంధువులు, ప్రముఖుల ల్యాండ్ ఫోన్‌నెంబర్లను సైతం వివరిస్తుంటారు. ఎవరి నెంబర్‌నైనా ఒకసారి మననం చేసుకుంటే చాలు జీవిత కాలం గుర్తుండి పోతుందని అంటున్నారు రాజిరెడ్డి. గ్రామంలో ఏ ఆపద సమయంలోనైనా అత్యవసరంగా ఎవరి చరవాణి నెంబర్ కావాలన్నా ఈయనకు ఫోన్‌చేసి అడుగుతుంటారు. నెంబర్లు గుర్తుంచుకోవడం ఈయనకు దశాబ్దకాలంపైగా అలవాటైంది. పిల్లలు, మనవల పుట్టిన తేదీలు, పెళ్లిరోజులు, ఇతర కార్యక్రమాలు తేదీలను అలవోకగా చెబుతుంటారు.


జీడిపల్లి రాజిరెడ్డి

◆ నెమిలకు చెందిన రాజిరెడ్డిది పూర్తిగా వ్యవసాయ ఆధారిత కుటుంబం. తనకున్న 14 ఎకరాలకు నాలుగు ఎకరాల్లో వరి, 6 ఎకరాల్లో పత్తి సాగును చేపడుతూ జీవనం సాగిస్తున్నాడు. భార్య ఆండాళు, కుమారులు నర్సింహారెడ్డి, రామకృష్ణారెడ్డి, కుమార్తె సుజాత ఉన్నారు. అందరికీ వివాహాలు జరిపించగా కుమారులు హైదరాబాద్‌లో ఉంటున్నారు. –న్యూస్‌టుడే, రాజపేట, ఆలేరు.

## జాగ్రత్తలు పాటించకపోతే కఠిన చర్యలు



కోదాడ, న్యూస్‌టుడే: మాంసం విక్రయించే దుకాణంలో వేలాడదీసిన మాంసాన్ని కుక్క తిన్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికుల కథనం ప్రకారం.. పట్టణంలో ఓ మటన్ సెంటర్ దుకాణాదారుడు దుకాణం తెరిచి బయటకు వెళ్లాడు. ఎవరూ లేకపోవడంతో దుకాణానికి వేలాడదీసిన మాంసాన్ని కుక్క తింటుండగా ఓ స్థానికుడు వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయడంతో అది వైరలైంది. దీంతో పురపాలక కమిషనర్ రమాదేవి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ యాదగిరి బుధవారం దుకాణాన్ని పరిశీలించి సీజ్ చేశారు. దుకాణదారుడికి రూ.2,000 చలానా విధించారు. జాగ్రత్తలు పాటించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ దుకాణదారులను హెచ్చరించారు.

## విధుల్లోనే ప్రాణాలు విడిచిన పోలీసు


పుట్ట యాదగిరి

చౌటుప్పల్‌గ్రామీణం, న్యూస్‌టుడే: విధుల్లో ఉన్న పోలీసు గుండెపోటుతో ప్రాణాలను విడిచిన ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌ప్లాజా వద్ద బుధవారం ఉదయం చోటుచేసుకుంది. పోలీస్ ఇన్‌స్పెక్టర్ మన్మథకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. నల్గొండ జిల్లా కేంద్రంలోని నందీశ్వర్ కాలనీకి చెందిన పుట్ట యాదగిరి(59) తిప్పర్తి పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్నారు. పంతంగి నుంచి టేకుమట్ల వరకు హైవే పెట్రోలింగ్ వాహనంపై యాదగిరి పని చేస్తారు. హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై వీఐపీలు వెళ్లేటప్పుడు వారి రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా ఈ పెట్రోలింగ్ వాహనంపై పని చేసేవారు చూస్తారు. బుధవారం ఉదయం ఏపీకి చెందిన ఓ మంత్రి హైదరాబాద్ నుంచి ఏపీకి వెళ్తుండటంతో బుధవారం ఉదయం 7:30 నిమిషాలకు పెట్రోలింగ్ వాహన సిబ్బంది పంతంగి టోల్‌ప్లాజా వద్దకు చేరుకున్నారు. యాదగిరి మూత్రవిసర్జనకు వెళ్లి అక్కడే కుప్పకూలిపోవడంతో తోటి పోలీసులు గమనించి వెంటనే చౌటుప్పల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే యాదగిరి మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతదేహానికి స్థానిక ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఎస్సై లక్ష్మయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ పేర్కొన్నారు.

## హైవేపై వాహనాల రద్దీ.. హోటళ్లు కిటకిట

చౌటుప్పల్‌గ్రామీణం, న్యూస్‌టుడే: దసరా సెలవులు రావడంతో రాజధాని హైదరాబాద్‌లో నివాసం ఉండే తెలుగు రాష్ట్రాల ప్రజలు సొంతూళ్ల బాట పడుతున్నారు. దీంతో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై వాహనాలు బారులు తీరుతున్నాయి. ప్రయాణికుల సంఖ్య పెరగడంతో హైవేపై ఉన్న హోటళ్లు, రెస్టారెంట్‌లకు గిరాకీ పెరిగింది. మార్గమధ్యలో ప్రయాణికులు హోటళ్ల వద్ద ఉదయం టిఫిన్, టీకి, మధ్యాహ్నం భోజనానికి ఆగుతుండటంతో జాతీయ రహదారిపై ఉన్న హోటళ్లు కిటకిటలాడుతున్నాయి. వ్యాపారం కూడా సాధారణ రోజుల కంటే అధికంగా జరుగుతున్నట్లు హోటల్ నిర్వాహకులు చెబుతున్నారు. కొన్ని పేరొందిన హోటళ్లలో ప్రయాణికులకు సీట్లు లభించక, వాహనాల పార్కింగ్‌లో స్థలం లేకపోవడంతో వెనుదిరుగుతున్నారు.



## గౌరమ్మను పూజించి.. ఆశీస్సులు ఆకాంక్షించి

నల్గొండ లీగల్, న్యూస్‌టుడే: న్యాయశాఖ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కోర్టు ప్రాంగణంలో బతుకమ్మ పండగను ఉద్యోగులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా జడ్జి నాగరాజు తన కుటుంబంతో సహా పాల్గొని పూజలు నిర్వహించారు. జిల్లాజడ్జి మాట్లాడుతూ.. తెలంగాణ ప్రాముఖ్యాన్ని బతుకమ్మ చాటుతుందని, న్యాయశాఖ ఉద్యోగులు బతుకమ్మ పండగను ఇక్కడ నిర్వహించడం ఎంతో అభినందనీయమన్నారు. అమ్మవారి ఆశీస్సులు అందరికీ లభించాలని ఆయన ఆకాంక్షించారు.

❐ న్యాయమూర్తి కుమార్తె రిత్విక ఉద్యోగులతో కలిసి బతుకమ్మను కీర్తిస్తూ పాటలు పాడటం అందరిని ఆకర్షించింది. అందంగా అలంకరించిన బతుకమ్మలకు జిల్లాజడ్జి నాగరాజు బహుమతులను అందజేశారు. జిల్లా న్యాయశాఖ ఉద్యోగ సంఘ అధ్యక్షుడు మాతంగి వీరబాబు, సభ్యులు గిరి, ఉషారాణి, లతీఫ్, రాంబాబు, వెంకటమ్మ, సరిత, సంధ్య తదితరులు పాల్గొన్నారు.


బతుకమ్మలతో ఉన్న గౌరమ్మకు పూజలు నిర్వహిస్తున్న జిల్లాజడ్జి నాగరాజు

# నల్గొండ
• నల్గొండ • మునుగోడు • నకిరేకల్


## పాపన్నగౌడ్ పోరాట స్ఫూర్తితో ముందుకు సాగాలి

శాలిగౌరారం, న్యూస్‌టుడే: తెలంగాణ ధీర త్వానికి ప్రతీకైన సర్దార్ పాపన్నగౌడ్ ఉద్యమ స్ఫూర్తితో బీసీలు ముందుకు సాగాలని మండలి మాజీ స్పీకర్ స్వామిగౌడ్ అన్నారు. శాలిగౌరారం మండలంలోని భైరవునిబండలో నూతనంగా నిర్మించిన సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరించి అనంతరం మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు పల్లె రవికుమార్, పంజాల జైహింద్‌గౌడ్, పంజాల శ్రవణ్‌కుమార్‌గౌడ్, చెరుకు సుధాకర్, ఆలేటి శ్రీనివాస్, మారిపెద్ది శ్రీనివాస్, నరేందర్, తదితరులు పాల్గొన్నారు

## భాజపా నాయకుల హర్షం

మునుగోడు, న్యూస్‌టుడే: హరియాణాలో భాజపా విజయభేరి మోగించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ఆ పార్టీ నాయకులు మునుగోడు మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద సంబరాలు నిర్వహించారు. మండల అధ్యక్షులు పెంబళ్ల జానయ్య, బండారు యాదయ్య, లింగయ్య, నర్సింహ, బొల్లూరి రమేష్ పాల్గొన్నారు.

**మేమున్నాం.. మీకు తోడుగా..** (10 AM TO 1 PM) 80085 52710, 80085 66199, 8008574421, 80085 74385

నల్గొండ జిల్లా పరిషత్తు, న్యూస్‌టుడే:

? పట్టణంలోని మర్రిగూడలో ఇళ్ల నుంచి వెలువడుతున్న మురుగు నీరు పంట చేలకు చేరుతోంది. మురుగు నీరు దిగువకు వెళ్లేందుకు కాల్వలు నిర్మించి పంటలను కాపాడాలి. –నగేష్‌యాదవ్, నల్గొండ.

✔ పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటాం. – నాగరాజు, శానిటరీ ఇన్‌స్పెక్టరు, నల్గొండ పురపాలిక.

## దసరాను ప్రశాంతంగా జరుపుకోవాలి: సీఐ

శాలిగౌరారం, న్యూస్‌టుడే: గ్రామాల్లో దసర ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని శాలిగౌరారం సీఐ కొండల్‌రెడ్డి అన్నారు. మండలంలోని తిర్మలరాయినిగూడెం దుర్గామాత మండపాన్ని పరిశీలించారు. రాత్రివేళల్లో మండపాల్లో కాపలా ఉంటూ విద్యుత్తు, ఇతర సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలని సూచించారు. కమిటీ సభ్యులు, మాల ధరించిన స్వాములతో మాట్లాడారు.


తిర్మలరాయినిగూడెంలో దుర్గామాత మండపాన్ని పరిశీలించి స్వాములకు సూచనలు ఇస్తున్న సీఐ కొండల్‌రెడ్డి

# యువతరం... ఆధ్యాత్మిక స్వరం

❒ దుర్గాదేవి మాలధారణతో ప్రత్యేక సేవలు


నార్కట్‌పల్లిలోని శ్రీవేణుగోపాల స్వామి భక్త మండలి నవశక్తి యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాత

నార్కట్‌పల్లి గ్రామీణం న్యూస్‌టుడే: ప్రస్తుత కాలంలో యువత సరదాలు, షికార్లు, చరవాణులకు అలవాటై భక్తి భావం అనేది లేకుండా ప్రవర్తిస్తున్న రోజులివి. కానీ.. అందరిలా కాకుండా నార్కట్‌పల్లి మండల కేంద్రానికి చెందిన కొంత మంది యువకులు ఆధ్యాత్మికత వైపు అడుగులేస్తున్నారు. ఏటా వచ్చే దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మాలలు ధరించి భక్తిభావాన్ని పెంపొందించుకుంటున్నారు. గత నెలలో జరిగిన గణపతి ఉత్సవాలు మొదలుకొని ప్రస్తుతం బతుకమ్మ, దసరా, దీపావళి ఇలా వరసగా పండుగలు ఉండటంతో గ్రామాల్లోనూ యువత ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపడుతున్నారు.

### రెండేళ్ల నుంచి దీక్ష:

పాలకూరి రమేష్, నార్కట్‌పల్లి



గత రెండేళ్ల నుంచి దుర్గామాత దీక్ష స్వీకరిస్తున్నాను. రోజూ తెల్లవారుజామున 4 గంటలకు మేల్కొని స్నానాలు ఆచరించి అమ్మవారికి ప్రత్యేక పూజలు, భజనలు చేయడం వల్ల ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత కలుగుతుంది. దీక్ష ద్వారా క్రమశిక్షణతో పాటు మంచి ఆహారపు అలవాట్లు అలవడతాయి.

### దాతల సహకారంతో..

నార్కట్‌పల్లిలోని శ్రీ వేణుగోపాల స్వామి భక్త మండల నవశక్తి యూత్ ఆధ్వర్యంలో కనకదుర్గ అమ్మవారిని ఆరేళ్ల నుంచి ఏర్పాటు చేసి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ప్రతి సంవత్సరం దాతల సాయంతో అమ్మవారి విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేస్తున్నారు. నిత్యం చేసే పూజా కార్యక్రమాలు, భజనలు తమలో భక్తి భావాన్ని పెంచుతున్నాయని యువకులు పేర్కొంటున్నారు. ఉత్సవాల సమయంలో మాల ధరించి నియమనిష్ఠలతో పూజలు చేయడం వల్ల క్రమశిక్షణతో పాటు మానసిక ప్రశాంతత కలుగుతోందని చెబుతున్నారు.


### తొమ్మిది రోజుల దీక్ష..

ప్రస్తుతం అంతటా బతుకమ్మ సంబురాలు, దుర్గామాత పూజలు కొనసాగుతున్నాయి. ఏటా అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా మాలలు ధరించి దీక్షలు చేపడుతున్నారు. రోజు సూర్యోదయం కంటే ముందే మేల్కొని స్నానాలాచరించడం, మళ్లీ సూర్యాస్తమయం తర్వాత స్నానాలాచరించి అమ్మవారికి పూజలు చేయడం వల్ల మానసిక ప్రశాంతత కలుగుతోందని పేర్కొంటున్నారు. చెడు వ్యసనాలు దరి చేరకుండా. సానుకూల దృక్పథం అలవడుతుందని అంటున్నారు. నవరాత్రి ఉత్సవాలు ముగిసి అమ్మవారి విగ్రహ నిమజ్జనం అనంతరం విజయవాడలోని దుర్గామాత ఆలయం వద్ద మాల విరమణ చేస్తామని చెబుతున్నారు. దీక్ష చేపట్టిన వారే కాకుండా మరి కొంత మంది ఉత్సవాలు వరకు ఒకపూట మాత్రమే భోజనం చేయడం పాదరక్షలు ధరించకుండా భక్తిభావాన్ని చాటుతున్నారు.


దుర్గామాత మండపం వద్ద భక్తులు

## నియామకపత్రాలు అందజేత

హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో కొత్త ఉపాధ్యాయులకు సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు నియామకపత్రాలను అందజేశారు.


నల్గొండకు చెందిన రేణుక గడపాకకు నియామకపత్రం అందజేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

### నాలుగు ప్రభుత్వ కొలువులు సాధించి

నకిరేకల్, న్యూస్‌టుడే: ఉద్యోగాల పోటీ పరీక్షల్లో ప్రతిభ చూపి నాలుగు సర్కారు కొలువులు సాధించారు.. నకిరేకల్ మండలం మోదినిగూడెం గ్రామానికి చెందిన వలిశెట్టి అనూష. మొదటగా సివిల్ కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికై శిక్షణలో ఉండగానే గురుకుల టీజీటీగా, కస్తూర్బా పాఠశాల ఉపాధ్యాయినిగా కొలువులు సాధించారు. అక్కడ పని చేస్తూనే డీఎస్సీలో ప్రతిభ చూపి 95వ ర్యాంకు సాధించారు. హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో ఎస్జీటీ నియామక ధ్రువపత్రాన్ని బుధవారం అందుకున్నారు. అనూష భర్త మహేశ్ కానిస్టేబుల్ శిక్షణలో ఉన్నారు. పది వరకు నకిరేకల్‌లో, ఇంటర్, డిగ్రీ, డీఈడీ, బీఈడీలను సూర్యాపేటలో పూర్తిచేశారు. ఎక్కడ కోచింగ్ తీసుకోకుండా ఉద్యోగాల పోటీ పరీక్షలకు సిద్ధమయ్యానని అనూష వివరించారు. తమ కూతురు నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడం ఆనందంగా ఉందని ఆమె తల్లిండ్రులు యాదగిరి, విజయలక్ష్మి చెప్పారు.



### ప్రపంచాన్ని చూడలేడు.. కానీ డీఎస్సీ సాధించాడు

నారాయణగూడ, న్యూస్‌టుడే: కృషి, పట్టుదల ఉంటే ఏదైనా సాధించొచ్చు అనడానికి నల్గొండకు చెందిన (అంధుడు) సైదావలి నిదర్శనం. తనకున్న వైకల్యంతో (అంధత్వం)ఏనాడు నిరుత్సాహ పడలేదు... బాధపడలేదు. మనోధైర్యంతో ఎస్‌జీటీగా ఎంపికయ్యాడు. తాను కోచింగ్ తీసుకోలేదు. యూట్యూబ్ సాయంతో సన్నద్ధమయ్యా. అమ్మానాన్నలు లేరు. అన్నయ్య, తమ్ముడున్నాడు. ఒకరు ట్రాక్టర్ డ్రైవర్ అయితే.. మరొకరు ఆటో మెకానిక్‌గా పనిచేస్తారు. హైదరాబాద్‌లోని టీవీ టవర్ వద్ద ఉన్న అంధుల హాస్టల్‌లో ఉండి చదువుకున్నా.. ఎలాగైన డీఎస్సీ సాధించాలనే పట్టుదలతో రోజూ కనీసం 18 గంటలు చదివా. అయితే పరీక్ష రాస్తున్నప్పుడు తమకు సహాయకులుగా 9, 10వ తరగతి విద్యార్థులను ఇచ్చారు. వారికి తాను చెప్పింది అర్థం కాదు.. వాళ్లేం రాస్తున్నారో నాకు కనిపించదు. మొత్తానికి కొలువు సాధించా. ఉద్యోగం రావడం ఎంతో ఆనందంగా ఉంది.



## ఉపకార వేతనాలకు మార్గదర్శకాలు జారీ

నల్గొండ సంక్షేమం, న్యూస్‌టుడే: జిల్లాలో అర్హులైన ఎస్సీ విద్యార్థులు పోస్టు మెట్రిక్ ఉపకారవేతనాల నమోదుకు కేంద్ర ప్రభుత్వం నూతన మార్గదర్శకాలు తీసుకొచ్చిందని ఎస్సీ అభివృద్ధి సంక్షేమశాఖాధికారి కోటేశ్వరారవు ఒక ప్రకటనలో తెలిపారు. నూతన విధానం ప్రకారం.. విద్యార్థి పేరు, పదో తరగతి మెమో, ఆధార్‌కార్డుతో సరిపోయే విధంగా సవరించుకోవాలని సూచించారు. జనరేట్ అయిన 12 అంకెల ఈ పాస్ ఐడీ ద్వారా మీ సేవా కేంద్రంలో బయోమెట్రిక్ అథెంటికేషన్ ఇవ్వాలని తెలిపారు. అనంతరం పాత పద్ధతిలోనే వెబ్‌సైట్‌లో తెలంగాణ ఈపాస్. సీజీజీ.జీవోవి నందు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ పూర్తయ్యాక బ్యాంక్‌లో ఆధార్ సీడింగ్ బ్యాంక్ ఖాతాగా మార్చుకోవాలని సూచించారు. నూతనంగా ఖాతా తెరిచేవారు ఆధార్ ఈకేవైసీ సదుపాయం ఉన్న పోస్టల్ ఖాతాలో తీసుకోవచ్చని తెలిపారు. ఆదాయ పరిమితి రూ.2లక్షల నుంచి రూ.2.50లక్షల వరకు పెంచారని తెలిపారు.

వంతెన సరే..

# సర్వీస్ రోడ్డు ఎక్కడ..!


మూసుకపోయిన సర్వీస్ రోడ్డు

కనగల్, న్యూస్‌టుడే: దర్వేశిపురం రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద వాయులేరు వాగుపై రూ.12 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న వంతెన పక్కన నుంచి సర్వీసు రోడ్డు నిర్మించక పోవడంతో ఆప్రాంత రైతులు తమ వ్యవసాయ భూములకు వెళ్లడానికి దారి లేకుండా పోయింది. వాయులేరు వాగుపై గతంలో నిర్మించిన వంతెన ఇరుకుగా మారడంతో నూతన వంతెన నిర్మాణం చేపట్టారు. వంతెన నిర్మాణం పూర్తికాగా దానిపై నుంచి దాదాపు వంద మీటర్లకు పైగా సైడ్ వాల్ నిర్మాణం చేపట్టారు. గతంతో రోడ్డు పక్క నుంచి వెళ్లిన రైతులకు ఇప్పుడు సైడ్ వాల్ నిర్మాణంతో బాట పూర్తిగా మూసుక పోయింది. దీంతో వారు తమ వ్యవసాయ భూములకు వెళ్లడానికి దారి లేకుండా అయ్యింది. ఇదే విషయంపై రైతులు కలెక్టర్‌కు వినతి పత్రం కూడా ఇచ్చారు. అక్కడ పూర్తిగా ప్రభుత్వ భూములే ఉన్నందున వంతెన పక్క నుంచి వ్యవసాయ భూముల వద్దకు వెళ్లడానికి సర్వీసు రోడ్డు ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

### సర్వీసు రోడ్డు ఏర్పాటు చేయాలి..

నెలగందరాశి వెంకయ్య, పర్వతగిరి

గతంలో పాత వంతెన పక్కనుంచి సర్వీసు రోడ్డు ఉండటంతో మా వ్యవసాయభూముల వద్దకు వెళ్లడానికి ఎలాంటి ఇబ్బంది ఉండేది కాదు. నూతన వంతెన నిర్మాణంతో పాటు వంద మీటర్ల దూరం సైడ్ వాల్ నిర్మించడంతో మాకు పూర్తిగా రహదారి లేకుండా పోయింది. వ్యవసాయ భూమి వద్దకు వెళ్లే పరిస్థితి లేదు. అధికారులు స్పందించి సైడ్‌వాల్ వెంట సర్వీస్ రహదారిని ఏర్పాటు చేసి తమ వ్యవసాయ భూముల వద్దకు వెళ్లడానికి దారిని ఏర్పాటు చేయాలి.

### రైతులకు ఇబ్బంది కలగకుండా రోడ్డు నిర్మిస్తాం..

దినేష్‌రెడ్డి, ఏఈ, ఆర్‌అండ్‌బీ

వంతెన వద్ద రైతులకు ఇబ్బంది కలగకుండా వారు కిందకు దిగే విధంగా రోడ్డును నిర్మిస్తాం. రోడ్డు నుంచి ఎంతవరకు లెవల్ వస్తే అంతవరకు మట్టి పోసి రోడ్డు వేస్తాం. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

# క్రీడలతో ఆరోగ్యం మెరుగు: మంత్రి


పోలీస్ క్రీడాకారులకు జ్ఞాపికలు అందజేస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్గొండ అర్బన్, న్యూస్‌టుడే: క్రీడలతో ఆరోగ్యం మెరుగు పడుతుందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రం సమీపంలోని 12వ పటాలంలో నిర్వహించిన స్పోర్ట్స్ మీట్ ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలీసులకు నిర్వహించే క్రీడలు ఉల్లాసంతో పాటు వ్యక్తిగత గుర్తింపు నిస్తాయన్నారు. పటాలంలో రోడ్ల నిర్మాణానికి రూ.60 లక్షలు మంజూరి చేస్తున్నట్లు తెలిపారు. పటాలం సిబ్బంది సమస్యలు పరిష్కారం అయ్యేలా చూస్తానని తెలిపారు. పర్యాటక శాఖ ద్వారా రూ.25 కోట్లతో హరిత హోటల్‌ను త్వరలో నిర్మాణం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. గెలుపొందిన వారికి జ్ఞాపికలు అందజేశారు. పటాలం కమాండెంట్ సత్యశ్రీనివాస్, మున్సిపల్ ఛైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు లక్ష్మయ్య, డీఎస్పీ శివరాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### ఆటలతో మానసికోల్లాసం..

చిట్యాల గ్రామీణం, న్యూస్‌టుడే: క్రీడలు శారీరక, మానసిక ఆనందంతో పాటు ఐక్యమత్యానికి దోహదం చేస్తాయని ఎస్సై ఎన్.ధర్మా, విశ్రాంత ఉపాధ్యాయుడు కే.రాఫెల్ అన్నారు. మండలంలోని వట్టిమర్తి జడ్పీ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వట్టిమర్తి ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలను బుధవారం ప్రారంభించి మాట్లాడారు. దసరా పండుగ సందర్భంగా ఈ క్రీడా పోటీలు మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు నర్రా మోహన్‌రెడ్డి, బుర్రి రవీందర్‌రెడ్డి పూర్వ విద్యార్థులు సాగర్ల నరేశ్, మేడి క్రిష్ణయ్య, శ్యాంసుందర్, కిషోర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## బెంచీల బహూకరణ

మర్రిగూడ, న్యూస్‌టుడే: యరగండ్లపల్లి గ్రామంలోని 25 ప్రధాన కూడలిలు, దేవాలయాల్లో ప్రజలు సేదతీరడానికి సుమారు రూ.3 లక్షల విలువైన 50 బెంచీలను సామాజిక కార్యకర్త వల్లంల సంతోష్ యాదవ్ ఏర్పాటు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రానున్న కాలంలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతానని తెలిపారు. మాజీ మాల్ మార్కెట్ యార్డు ఛైర్మన్ దంటు జగన్ పాల్గొన్నారు.

గట్టుప్పల: మండల పరిధిలోని తేరట్‌పల్లి గ్రామంలో చైతన్య యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన అమ్మవారిని మాజీ సర్పంచి వీరమల్ల శ్రీశైలం గౌడ్ సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. యాదయ్య, పెద్దులు, సత్తయ్య, శ్రీనివాస్, మల్లేశం, పాల్గొన్నారు.

## 'నవ రాత్రి' సందడి..

చిట్యాల, న్యూస్‌టుడే: దేవీ నవరాత్రి ఉత్సవాల సందడిలో గాజుల సవ్వడి ప్రత్యేకంగా వినిపిస్తోంది. చిట్యాల పురపాలిక పరిధిలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని, పలువురు యువతులు, మహిళలు తొమ్మిది రకాల రంగుల గాజులను నాలుగేళ్ల వయసు దాటిన చిన్నారుల నుంచి నడివయసు మహిళల వరకు ధరిస్తున్నారు. అమ్మవారి ఉత్సవాలు 9రోజులకు గుర్తుగా వీటిని భక్తి, శ్రద్ధలతో ధరిస్తున్నామని వారు పేర్కొంటున్నారు. చిట్యాల పురపాలికలో ఇలాంటి పోకడ కనిపిస్తోంది.


నవరాత్రి ఉత్సవాల సందర్భంగా తొమ్మిదిరంగుల గాజులను ధరించిన చిట్యాలకు చెందిన చిన్నారి అమ్ములు

### బతుకమ్మ వేడుకలు


నార్కట్‌పల్లిలో తహసీల్ కార్యాలయంలో..


నల్గొండ శ్రీ చైతన్య పాఠశాలలో..

**పూర్వ విద్యార్థుల ఆర్థిక సాయం శాలిగౌరారం:** శాలిగౌరారంలోని మార్కెట్ కాలనీలో ఇటీవల రావుల యలమయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న యలమయ్య కుమారుడు రావుల సురేష్‌తో 2007లో పదోతరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు రూ. 25వేలు ఆర్థికసాయం అందించి మానవత్వం చాటుకున్నారు.

**పరామర్శ.. మర్రిగూడ:** మండల పరిధిలోని కొండూరు గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు ఉడుతల యాదయ్య తండ్రి పెద్దులు మృతి చెందగా జడ్పీటీసీ మాజీ సభ్యుడు పాశం సురేందర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెన్నమనేని రవీందర్‌రావులు పరామర్శించారు. మాల్ మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ పాల్వాయి అనిల్‌రెడ్డి, విష్ణు, రామారావు, నగేష్, వెంకటయ్య, నర్సమ్మలు ఉన్నారు.

## పింఛను పథకం అమలు చేయాలి

చిట్యాల: పాత్రికేయులకు కనీసం రూ.10వేలు ఉండేవిధంగా పింఛను పథకాన్ని అమలుచేయాలని తెలంగాణ మలిదశ సీనియర్ ఉద్యమకారుడు కూనూరు సంజయిదాస్‌గౌడ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చిట్యాలలో బుధవారం పాత్రికేయులను సన్మానించారు. ఎన్నికల్లో పాత్రికేయులకు కాంగ్రెస్ హామీలను అమలుచేయాలని డిమాండ్‌చేశారు.

## నిర్మాణం ఆగి.. వృథాగా మారి

కట్టంగూరు, న్యూస్‌టుడే: రెండు పడక గదుల నిర్మాణం కోసం కట్టంగూరు మండలంలో చేపట్టిన ఏకైక భవన నిర్మాణం అర్ధాంతరంగా నిలిచి ఏళ్లు గడుస్తోంది. దీంతో ఈ భవనం వృథాగా మారింది. గత ప్రభుత్వ హయాంలో అయిటిపాముల రెవెన్యూ పరిధిలోని ప్రభుత్వ భూమిలో



జాతీయ రహదారి వెంబడి రెండు ఎకరాల స్థలం సేకరించింది. 100 గృహాలతో కూడిన అపార్టుమెంటు భవన నిర్మాణం కోసం రూ.5.04 కోట్లతో పనులు ప్రారంభించారు. 32 గృహాల స్లాబులు పూర్తయ్యాయి. 48 పునాది దశ దాటాయి. అనంతరం గుత్తేదారు పనులు మధ్యలో వదిలేశారు. నాటి నుంచి ఒక్క అడుగు కూడా పనులు ముందుకు జరగలేదు. ఉన్నత అధికారులు చొరవ తీసుకొని అర్ధాంతరంగా నిలిచిన ఈ భవనాన్ని పూర్తి చేయించి, వాడుకలోకి తీసుకు రావాలని స్థానికులు కోరుతున్నారు.

## గుండె పోటుతో వ్యక్తి మృతి

కనగల్,న్యూస్‌టుడే: కనగల్ గ్రామానికి చెందిన భైరగోని శంకర్ (40) బుధవారం తెల్లవారుజామున గుండె పోటుతో మృతి చెందారు. స్థానిక పీహెచ్‌సీలో వైద్యులు అందుబాటులో లేకపోవడంతో నల్గొండకు తరలించగా అప్పటికే మృతి చెందారు. ఈయన చండూరు మండల కేంద్రంలో ప్రైవేట్ పాఠశాల్లో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. కనగల్ పీహెచ్‌సీలో వైద్యులు అందుబాటులో ఉంటే సీపీఆర్ చేస్తే బతికేవాడని స్థానికులు వాపోయారు. కుటుంబ సభ్యులకు పలువురు ఆర్థిక సాయం అందజేశారు.

## పోలీసుల అదుపులో విద్యుత్తు మోటార్ల దొంగలు!

కనగల్,న్యూస్‌టుడే: మండలంలోని పలు గ్రామాల్లో గత కొద్ది రోజులుగా మోటార్లు, సర్వీసు వైర్ల చోరీకి పాల్పడుతున్న ముఠాను కనగల్‌లో పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. కనగల్‌కు చెందిన ఐదుగురు సభ్యుల ముఠా గత రెండేళ్లుగా ఏఎమ్మార్పీ పరిధిలోని కాల్వల వెంట గల మోటార్లు, సర్వీసు వైర్లను ఎత్తుకెళ్లి దర్వేశిపురంలో పాత ఇనుప సమాన్ల వ్యాపారం చేసే వ్యక్తి విక్రయించినట్లు తెలిసింది. పోలీసులు ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. వారు పాత ఇనుప సమాన్ల వ్యాపారికి 16 మోటార్లు విక్రయించినట్లు పేర్కొన్నట్లు సమాచారం.

## కలెక్టరేట్ ఎదుట ధర్నా

నల్గొండ కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణ అమలులో జాప్యం చేస్తూ ఉద్యోగాలను భర్తీ చేస్తున్నందుకు నిరసనగా బుధవారం మాదిగ సంఘాలు అంబేడ్కర్ విగ్రహం నుంచి నిరసన ప్రదర్శన చేపట్టారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్ అమలు చేయకుండా జాప్యం చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం మాదిగలకు అన్యాయం చేస్తుందన్నారు. వెంటనే ఎస్సీ రిజర్వేషన్ అమలు చేసి ఉద్యోగాల భర్తీ ప్రకటన చేయాలని కోరారు. ముఖ్యమంత్రి స్పందించకుంటే ఉద్యమాన్ని ఉద్ధృతం చేయనున్నట్లు తెలిపారు.

## తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

నల్గొండ నేరవిభాగం, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలోని హైటెక్ కాలనీకి చెందిన చింతల పెద్దలింగయ్య ఇంటికి తాళం వేసి ఉండటంతో బుధవారం తెల్లవారు జామున గుర్తు తెలియని దుండగులు దొంగతనానికి పాల్పడినట్లు వన్‌టౌన్ సీఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. ఇంటి తాళం పగులగొట్టి బీరువాలో ఉన్న నాలుగు తులాల బంగారం ఆభరణాలు, ఏడు తులాల వెండి ఆభరణాలు, రూ.20 వేల నగదు ఎత్తుకెళ్లారు. దీంతో పాటు పక్కనే ఉన్న దాస్రీ నగర్ కాలనీకి చెందిన బాలు నాయక్ ఇంటి తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్లి బుధవారం ఉదయం వచ్చి చూసుకోగా ఇంటి తాళం పగులగొట్టి బీరువాలో ఉన్న నాలుగు తులాల బంగారం వస్తువులు, రూ.1.55 లక్షల నగదు ఎత్తుకెళ్లినట్టు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు. వరస దొంగతనాలకు పాల్పడింది ముగ్గురు అంతరాష్ట్ర ముఠా సభ్యుల పని అయి ఉంటుందని సీసీ కెమెరాల ఆధారంగా పోలీసులు అనుమానిస్తున్నారు.

## పశువుల పట్టివేత



కట్టంగూరు, న్యూస్‌టుడే: అక్రమంగా తరలిస్తున్న పశువులను పోలీసులు కట్టంగూరులో బుధవారం పట్టుకున్నారు. ఒడిశా నుంచి హైదరాబాద్‌కు డీసీఎం వ్యానులో 22 ఆవులు, 36 ఎద్దులను అనుమతి పత్రాలు లేకుండా కబేళాకు తరలిస్తుండగా కట్టంగూరులో స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రవీందర్ తెలిపారు. డ్రైవర్ నకిరేకల్‌కు చెందిన కొండ వెంకన్నను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి, పశువులను చెరువుపల్లి గోశాలకు తరలించినట్లు చెప్పారు.

# సరస్వతీ అవతారంలో దుర్గాదేవి


కనగల్: దర్వేశిపురం రేణుక ఎల్లమ్మ ఆలయంలో సరస్వతీదేవిగా అమ్మవారు


నార్కట్‌పల్లిలో భక్తులతో ఎమ్మెల్యే వేముల వీరేశం

దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జిల్లాలో అమ్మవారు బుధవారం విజ్ఞాన మాత శ్రీమహా సరస్వతీదేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. కుంకుమార్చనలో మహిళలు పాల్గొన్నారు. చిన్నారుల నృత్యప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ప్రతిభ కనబరిచిన చిన్నారులకు బహుమతులను సమకూర్చారు. బాలలకు అక్షరాభ్యాసం చేయించారు. –న్యూస్‌టుడే, బృందం.


మునుగోడు: శ్రీ ప్రాచీన శివరామక్షేత్ర ఆలయంలో..


నకిరేకల్: వీటీ కాలనీ దుర్గామాత మండపంలో..


కేతేపల్లిలో..


నాంపల్లి: మండలకేంద్రంలో..


మునుగోడులోని చండూరు రోడ్డులో..


మర్రిగూడ: అమ్మవారి వద్ద పూజలు నిర్వహిస్తున్న భవాని మాలధారులు


చిట్యాల కనకదుర్గ ఆలయంలో..


## ప్రమాదాన్ని పూడ్చండి

ఈ చిత్రంలో కనిపిస్తున్నది మునుగోడు మండల కేంద్రంలోని పాత ఎంపీడీవో కార్యాలయానికి ఎదురుగా ఉన్న ముఖం ద్వారం నుంచి లోపలికి వచ్చే దారి ఇది. ప్రధాన రహదారి నుంచి ప్రభుత్వ కార్యాలయాల లోపలికి వెళ్లే ద్వారం వద్ద ఉన్న మలుపులో మరమ్మతుల పనుల కోసమని కొద్ది నెలల క్రితం గుంతను తీశారు. పనులు పూర్తి చేసిన తర్వాత దానిని పూడ్చటం మరిచారు. దీంతో ఆ వైపుగా కారు, ద్విచక్ర వాహనాలు ఏ మాత్రం అజాగ్రత్తగా వచ్చిన ఆ గుంతలో పడే ప్రమాదం ఉంది. అధికారులు నిత్యం ఇటుగా వెళ్తున్నా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. –మునుగోడు, న్యూస్‌టుడే



# మిర్యాలగూడ

•మిర్యాలగూడ • నాగార్జునసాగర్ • దేవరకొండ


ఉపవాసదీక్షలో ఉన్న పూజారి కేతావత్ జీవన్‌ప్రసాద్ భగత్

## కొనసాగుతున్న ఉపవాస దీక్ష

చందంపేట, న్యూస్‌టుడే: కులాలకు అతీతంగా దసరా ముందు రోజు ప్రారంభం కానున్న అంబా భవాన్ని ఉత్సవాల సందర్భంగా చేపట్టిన ఉపవాసదీక్ష బుధవారం ఏడో రోజుకు చేరింది. వివిధ ప్రాంతాల భక్తులు భారీగా తరలివెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొమ్మిది రోజుల పాటు పూజారి ఆలయం నుంచి బయటకు రాకుండా నిబద్ధతతో దీక్ష చేపడుతున్నారు. ఈనెల 11న ఉపవాసదీక్ష విరమణ అనంతరం జంతుబలిదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.

**చింతపల్లి, న్యూస్‌టుడే:**

? చింతపల్లి మండల కేంద్రంలోని బీసీ కాలనీలోని ఇళ్ల మధ్య పిచ్చి మొక్కలు పెరగడంతో దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. –శ్రీను, చింతపల్లి.

✔ సమాధానం: సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం. –ప్రదీప్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి, చింతపల్లి

**మేమున్నాం.. మీకు తోడుగా..** (10 AM TO 1 PM) 77994 92939 99121 74975 98487 81656

**కొండమల్లేపల్లి, న్యూస్‌టుడే:**

? స్థానిక సాగర్‌రోడ్డులో తిరుమలానగర్‌లో ఇళ్లకు సరఫరా అయ్యే మిషన్ భగీరథ నీరు వాసన వస్తుంది. దీంతో తాగలేకపోతున్నాం.
–ఎమ్.కరుణాకర్, తిరుమలానగర్, కొండమల్లేపల్లి:

✔ సమస్య దృష్టికి వచ్చింది. ఇటీవల మరమ్మతులు చేయడం వల్ల నీరు కలుషితమైనట్లుగా గుర్తించాం. సమస్యను పరిష్కరిస్తాం. –మాల్యాద్రి, ఏఈ, మిషన్ భగీరథ:

**మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే:**

? పట్టణంలోని ప్రకాష్‌నగర్‌లో తాగునీటి పైపులైను గేట్ వాల్వ్ వద్ద నీరు లీకవుతూ..గుంత పడి ప్రమాదకరంగా మారింది: –సిరాజ్, మిర్యాలగూడ.

✔ తాగునీటి పైపులైన్ గేట్ వాల్వ్‌కు మరమ్మతులు చేపడతాం: –ఎండీ యూసుఫ్, పుర కమిషనర్, మిర్యాలగూడ.

**దేవరకొండ, న్యూస్‌టుడే:**

? దేవరకొండ పట్టణంలో డిండి క్రాస్ రోడ్డు నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు ట్రాఫిక్ పద్మవ్యూహాన్ని తలపిస్తుంది. రోడ్డుపైనే వాహనాలు నిలిపివేస్తున్నారు.
–జనార్ధన్‌రావు, దేవరకొండ

✔ దసరా పండుగ సందర్భంగా రాకపోకలు పెరిగాయి. పండుగ తర్వాత ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటాం.. –నర్సింహులు, సీఐ

## గ్రంథాలయం.. కొలువుల నిలయం

దేవరకొండ, న్యూస్‌టుడే: విజ్ఞానగని.. జ్ఞానసముపార్జనకు ఖజానాగా భావించే గ్రంథాలయాలు పేద విద్యార్థులకు వరంలా టివి. పోటీ పరీక్షల్లో ప్రభుత్వ ఉద్యోగాల సాధనకు నిలయంగా ఉంటూ జీవితంలో నిలబడేందుకు నిరుద్యోగులకు బాటలు వేస్తున్నాయి. దేవరకొండలోని గ్రంథాలయంలో చదివి తొమ్మిది మంది ఉపాధ్యాయ కొలువులు సాధించారు. మంచి ర్యాంకు సాధించేందుకు పలు రకాల పుస్తకాలు అందుబాటులో ఉండడంతో మార్గం సుగమమైందని వారు తెలిపారు. దేవరకొండ విద్యాడివిజన్ పరిధిలో 13 మండలాల్లో 92 మంది డీఎస్సీలో ఉపాధ్యాయ కొలువులు సాధించారు.


దేవరకొండ గ్రంథాలయంలో చదువుతున్న పోటీ పరీక్షల అభ్యర్థులు

### కష్టాల కడలి నుంచి



కాత్రావత్ పరశురాం, స్కూల్ అసిస్టెంట్, ఇంగ్లిష్

మాది డిండి మండలం బురాన్‌పూర్‌తండా. మా నాన్నను చిన్నతనంలోనే కోల్పోయాను. తర్వాత మా కుటుంబం ఎన్నో ఇబ్బందులు పడింది. పూట గడవని పరిస్థితుల నేపథ్యంలో హైదరాబాద్‌కు వలసవెళ్లి అక్కడ కూలీ పనులు చేసుకొని జీవనం సాగించాం. ప్రభుత్వ పాఠశాలలోనే ప్రాథమిక విద్యను అభ్యసించాను. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎం.ఎ. ఇంగ్లిష్ పూర్తిచేశాను. తర్వాత బీఈడీ, ఎంఈడీ పూర్తిచేశాను. గ్రంథాలయానికి రోజూ వెళ్తూ కష్టపడి చదివి డీఎస్సీ పోటీ పరీక్షల్లో స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లిష్ కొలువు సాధించాను.

### ఉద్యోగానికి పేదరికం అడ్డు కాదు



మహ్మద్ జావిద్, స్కూల్ అసిస్టెంట్, సోషల్

మాకు దేవరకొండ పట్టణంలోని వెంకటేశ్వర థియేటర్ ఎదురుగా పాత సామన్లు కొనుగోలు చేసే దుకాణం ఉంది. మా తల్లిదండ్రుల పేర్లు జాఫర్, నజ్మా. నేను దేవరకొండ గ్రంథాలయంలో చదువుతూ హాస్టల్ వార్డెన్‌గా మొదటగా అర్హత సాధించాను. కొద్ది రోజులకే డీఎస్సీ సాధన కోసం గ్రంథాలయంలో పుస్తకాలు చదివి ఉద్యోగ కొలువు సాధించినందుకు సంతోషంగా ఉంది. మా అమ్మ ఏడాది క్రితం చనిపోయింది. కన్నీళ్లు దిగమింగుతూ సాధన చేసి డీఎస్సీ పోటీ పరీక్షల్లో స్కూల్ అసిస్టెంట్, సోషల్ ఉద్యోగం సాధించాను.

### పంచాయతీ కార్యదర్శి నుంచి



త్రివేణి, ఎస్జీటీ

నేను దేవరకొండ మండలం వైదొని వంపు పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్నాను. పవిత్రమైన ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగాలని సంకల్పంతో నా భర్త యాదగిరి స్కూల్ అసిస్టెంట్ కావడంతో ఆయన ప్రోత్సాహంతో డీఎస్సీకి సాధన చేశాను. దేవరకొండ గ్రంథాలయంలో చదువుతూ ఒకవైపు ఉద్యోగం చేసుకుంటూ ముందుకు సాగాను. ప్రభుత్వ పాఠశాలలో చదివే పేద విద్యార్థులకు జ్ఞానజ్యోతిని వెలిగించాలన్న సంకల్పంతో కష్టపడి డీఎస్సీలో ఎస్జీటీగా కొలువు సాధించాను.

## ఆత్మ విశ్వాసం.. అత్తామామల ప్రోత్సాహం

మిర్యాలగూడ: అత్తామామల ప్రోత్సాహం.. అనుకున్నది సాధించాలనే లక్ష్యం.. ఈ రెండు తన విజయానికి కారణాలయ్యాయని చెబుతున్నారు మిర్యాలగూడ శాంతినగర్‌కు చెందిన **నేరేడుకొమ్ము మీనా.** ఇటీవల విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో బీసీ ఏ విభాగంలో స్కూల్ అసిస్టెంట్ హిందీ, లాంగ్వేజ్ పండిట్ హిందీ ఉపాధ్యాయురాలిగా మొదటి ర్యాంకు సాధించి రెండు ఉద్యోగాలకు ఎంపికై మహిళలకు ఆదర్శంగా నిలుస్తున్నారు.



❐ పట్టణానికి చెందిన మీనా స్థానికంగా డిగ్రీ చదువుతూనే 2007లో సెలూన్ నిర్వాహకుడు తాడాల నగేష్‌ను వివాహం కాగా.. ఇద్దరు పిల్లలున్నారు. వివాహం అనంతరం భర్త ప్రోత్సాహంతో డిగ్రీ పూర్తిచేసి దాచేపల్లిలో హిందీ పండిట్ పూర్తి చేశారు. 2011లో టెట్ రాసి అర్హత సాధించి 2012లో డీఎస్సీ రాయగా ఒక్క మార్కుతో ఉద్యోగం కోల్పోయారు. ఆత్మవిశ్వాసం కోల్పోకుండా పోటీ పరీక్షలు రాస్తూ 2017లో కేజీబీవీలో సీఆర్టీగా ఎంపికై తిరుమలగిరిసాగర్‌లో పనిచేశారు. పిల్లలను అత్తమామలకు అప్పగించి ఉద్యోగం చేస్తూనే ఇటీవల డీఎస్సీ రాసి రెండు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. హిందీ భాష ప్రాధాన్యత గుర్తించి హిందీలో డాక్టరేట్ చేసిన సత్యనారాయణ సూచనతో ముందుకు సాగినట్లు మీనా తెలిపారు.

## సినిమాలు

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే

**రాఘవ:** దేవర, **వెంకటేశ్వర:** దేవర, **శ్రీనివాస:** వేట్టయన్
**విట్రోస్:** దేవర, వేట్టయన్

## కూలీపని చేసి నన్ను చదివించారు



గుర్రంపోడు: నిత్యం కూలీ పని చేసి నన్ను చదివించిన నా తల్లిదండ్రుల త్యాగం వల్లే నేను ఈ రోజు ఉపాధ్యాయుడిగా ప్రభుత్వ ఉద్యోగం సాధించగలిగానని ఎస్జీటీ విజేత నల్లబోతు శివ చెప్పాడు. గుర్రంపోడు మండలం కొప్పోలు గ్రామానికి చెందిన నల్లబోతు సైదులు, చంద్రమ్మల కుమారుడు నల్లబోతు శివ ఇటీవల డీఎస్సీ ఫలితాల్లో ఉద్యోగం సాధించాడు. ఉపాధ్యాయ వృత్తిపై ఉన్న గౌరవంతో, ప్రభుత్వ ఉద్యోగ సాధనే లక్ష్యంగా చదివానని ఈ ఉద్యోగ సాధనలో తన భార్య జ్యోతి పూర్తి సహకారం అందించిందని శివ తెలిపాడు.

## తండ్రి రిక్షా కార్మికుడు.. కొడుకు ఉపాధ్యాయుడు..

మిర్యాలగూడ పట్టణం: రిక్షా కార్మికుడి కుమారుడు ప్రభుత్వ ఉపాధ్యాయుడు అయ్యాడు. ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన డీఎస్సీ ఫలితాల్లో మిర్యాలగూడ పట్టణంలోని రవీంద్రనగర్‌కు చెందిన ముడావత్ గణేశ్ ఎస్జీటీగా అర్హత సాధించి బుధవారం నియామక పత్రం అందుకున్నారు. గణేశ్ తండ్రి పంతులు రిక్షా నడుపుతూ నలుగురు కుమార్తెలు, ఇద్దరు కుమారులను ఉన్నత చదివించారు. తల్లిదండ్రుల కష్టాన్ని వృథా చేయని పిల్లలు మంచి ఉద్యోగాలు సాధించారు. తాజాగా చిన్న కుమారుడైన గణేశ్ సైతం ప్రభుత్వం ఉద్యోగం సాధించడంతో తల్లిదండ్రుల ఆనందానికి అవధులు లేవు. ఇన్నాళ్లు తాము పడిన కష్టానికి ప్రతిఫలం దక్కిందని తండ్రి పంతులు తన సంతోషాన్ని వెలిబుచ్చారు.



## ఒకే గ్రామంలో నలుగురికి ఉద్యోగాలు

చింతపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని వర్కాల గ్రామంలో నలుగురు యువతీ యువకులు డీఎస్సీలో ఉద్యోగాలు సాధించారు. గ్రామానికి చెందిన వింజమూరి కొండల్(స్కూల్ అసిస్టెంట్), పోలే కృష్ణ, వింజమూరు వరలక్ష్మి, శ్రీరామోజు సుజాత ఎస్జీటీలుగా ఉద్యోగాలకు ఎంపికయ్యారు. చింతపల్లి గ్రామానికి చెందిన లక్ష్మణ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ ఎస్జీటీలో ఉద్యోగం సాధించారు.


జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

## విద్యారంగ పటిష్టతకు ప్రభుత్వం కృషి: ఎమ్మెల్యే

మిర్యాలగూడ, న్యూస్‌టుడే: ప్రభుత్వ విద్యారంగాన్ని పటిష్ఠ పరుస్తూ మెరుగైన విద్య అందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. పట్టణంలోని ఎన్నెస్పీ క్యాంపు మైదానం నుంచి హైదరాబాద్‌కు బయలు దేరి వెళ్తున్న డీఎస్సీలో ఉపాధ్యాయులుగా ఎంపికైన అభ్యర్థులకు బుధవారం ఆయన వీడ్కోలు పలికి మాట్లాడారు. పుర కమిషనర్ యూసుఫ్, ఎంఈవోలు బాలాజీనాయక్, రవినాయక్, వెంకన్న పాల్గొన్నారు.

దేవరకొండ: డీఎస్సీలో అర్హత సాధించి నియామకపత్రాలు అందుకునేందుకు ఉపాధ్యాయులు బుధవారం హైదరాబాద్ ఎల్బీ స్టేడియానికి బయల్దేరి వెళ్లారు. దేవరకొండ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో రెండు ఆర్టీసీ బస్సులను విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు.

## సస్యరక్షణ చర్యలతో మెరుగైన ఫలితాలు

అడవిదేవులపల్లి, న్యూస్‌టుడే: సస్యరక్షణ చర్యలతో మెరుగైన ఫలితాలు సాధించవచ్చని సహాయ వ్యవసాయ సంచాలకులు బి.దేవ్‌సింగ్ నాయక్ అన్నారు. మండలంలోని జిలకరకుంటతండాలో బుధవారం వరి పొలాలను పరిశీలించి మాట్లాడారు. ప్రస్తుతం పంటలో ఆకుచుట్ట పరుగు ఉద్ధృతి అధికంగా ఉందని, దాని నివారణకు ఇండాక్సార్బ్ 200ఎంఎల్ ఒక ఎకరానికి లేదా ఇమామెక్టిన్ బెంజోయేట్ 200 గ్రాములు ఒక ఎకరానికి పిచికారి చేసుకోవాలని తెలిపారు. ఆయన వెంట ఏఈవోలు మహేష్ నాయక్, నరేశ్ రైతులున్నారు.

## ఆర్యవైశ్యులు రాజకీయంగా ఎదగాలి

దేవరకొండ, న్యూస్‌టుడే: ఆర్యవైశ్యులు రాజకీయంగా ఎదగాలని రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ కల్వ సుజాత అన్నారు. బుధవారం దేవరకొండ వాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయాన్ని సందర్శించి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలను ఆమెను సన్మానించారు. తెలుగు యూనివర్శిటీకి పొట్టి శ్రీరాములు పేరును మార్చి వేరే పేరు పెట్టడం సరికాదని నేను ప్రభుత్వంలో ఉన్నా.. మీ అందరితో పాటు పోరాడుతానని అన్నారు. పురపాలిక సంఘం ఛైర్మన్ ఆలంపల్లి నర్సింహ, దేవాలయ ఛైర్మన్ చీదెళ్ల వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, మల్లయ్య తదితరులున్నారు.


దేవరకొండ వాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయంలో రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ కల్వ సుజాతను సన్మానిస్తున్న మహిళలు

## కొబ్బరి చెట్లపై పిడుగు

మిర్యాలగూడ గ్రామీణం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని అవంతీపురంలో పి.రమేష్, మహంకాళి అనే మామ అల్లుళ్ల ఇళ్లలో ఉన్న రెండు కొబ్బరి చెట్లపై బుధవారం సాయంత్రం పిడుగు పడి మంటలు వచ్చాయి. బుధవారం సాయంత్రం నల్లని మబ్బులు పడి చిరుజల్లు పడుతున్న సమయంలో ఒక్కసారిగా పెద్దగా ఉరుముతూ... సుమారు వంద మీటర్ల దూరంలో రెండు కొబ్బరి చెట్లపై పిడుగు పడింది. ఆ సమయంలో ఇళ్లలో ఎవరూ లేరని ప్రమాదం తప్పిందని గ్రామస్థులు తెలిపారు.

## చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గుర్రంపోడు, న్యూస్‌టుడే: భూమి దస్త్రాలు తారుమారు చేసి తన భూమిని మరో వ్యక్తికి రాసిచ్చారన్న ఆవేదనతో పది రోజుల క్రితం పురుగు మందు తాగిన బుడిగపాక వెంకన్న (36) బుధవారం ఆసుపత్రిలో మృతి చెందాడు. ఆయనకు భార్య ఇద్దరు పిల్లలున్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

చందంపేట, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలైన ఘటన బుధవారం తెల్‌దేవరపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. మోత్యతండా గ్రామానికి చెందిన సపావట్ లచ్చ్యు ద్విచక్ర వాహనంపై కంబాలపల్లి వైపు వెళ్లారు. ఈ క్రమంలో తెల్‌దేవరపల్లి గ్రామ శివారులో మలుపు వద్ద వాహనం అదుపుతప్పి పల్టీ కొట్టింది. ప్రమాదంలో సపావట్ లచ్చ్యుకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.


కొండమల్లేపల్లి: పూజలో పాల్గొన్న ఆర్యవైశ్య సంఘం సభ్యులు


దేవరకొండలో కోలాటం నిర్వహిస్తున్న మహిళా భక్తులు


హాలియాలో శ్రీచండీహోమంలో పాల్గొన్న పురపాలక ఛైర్‌పర్సన్ యడవల్లి అనుపమ, నరేందర్‌రెడ్డి దంపతులు

## వైభవంగా దేవీ నవరాత్రి ఉత్సవాలు

దేవీ శరన్నవరాత్రి వేడుకల్లో బుధవారం అమ్మవారిని శ్రీ సరస్వతీ దేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. శ్రీ అష్టలక్ష్మి ఆలయంలో ఏర్పాటు చేసిన పూజల్లో పట్టణం పరిసర ప్రాంతాల నుంచి విద్యార్థులు పాల్గొని పూజలు చేశారు. సాగర్‌రోడ్డులో గల వాసవీమాత ఆలయంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మండల పరిధిలోని శ్రీసరస్వతి అమ్మవారి దేవాలయంలో శాసన సభ్యుడు బత్తుల లక్ష్మారెడ్డి మాధవి దంపతులు బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. దేవాలయంలో నిర్వహించిన సామూహిక అక్షరాభ్యాసాల్లో చిన్నారులతో ఓనమాలు దిద్దించారు. పూజా కార్యక్రమం అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే దంపతులను శాలువాతో సన్మానించారు. హాలియాలో శ్రీచండీ హోమం, అన్నదాన కార్యక్రమం వైభవంగా నిర్వహించారు.
–న్యూస్‌టుడే బృందం


అడవిదేవులపల్లిలో శ్రీ మహా సరస్వతి అలంకారంలో..


శ్రీసరస్వతి అమ్మవారికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, మాధవి దంపతులు


చింతపల్లిలో పూజలు చేస్తున్న భక్తులు

## పీఆర్‌టీయూ కార్యవర్గంలో చోటు

నిడమనూరు, న్యూస్‌టుడే: పీఆర్టీయూ రాష్ట్ర కార్యవర్గానికి నిడమనూరు మండలానికి చెందిన ఐదుగురు ఉపాధ్యాయులు ఎన్నికయ్యారు. బుధవారం హైదరాబాద్ శామీర్‌పేటలో జరిగిన 35వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో జరిగిన ఎన్నికల్లో ఈ ఎన్నికలు జరిగాయి. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా ఎంఈవో లావూరి వెంకన్న, గౌతమ్, నామిరెడ్డి వెంకట్‌రెడ్డి, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా గౌతమ్, శ్రీవెంకట్‌లు ఎన్నికైనట్లు నిడమనూరు మండల పీఆర్‌టీయూ అధ్యక్షుడు పాంపాటి శ్రీనివాస్ తెలిపారు.

మిర్యాలగూడ పట్టణం: పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా మిర్యాలగూడ ప్రాంతానికి చెందిన పలువురు నియమితులయ్యారు. గుగులోతు గోపీనాయక్, యడవెల్లి దామోదర్‌రెడ్డి, భగవాన్‌నాయక్, గుర్రం రవీందర్, నాయిని వెంకటయ్య, మోహన్‌రెడ్డిలు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా ఎన్నికయ్యారు.

పెద్దఅడిశర్లపల్లి: పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా పీఏపల్లి మండలం నుంచి జె.శ్రీనివాసరావు, రాష్ట్ర మహిళా అసోసియేట్ అధ్యక్షురాలిగా శ్రీ విద్య, రాష్ట్ర కార్యదర్శిగా బి.వెంకటేశ్వర్లు, జిల్లా అసోసియేట్ అధ్యక్షులుగా ఎం.సుదర్శన్, జిల్లా ఉపాధ్యక్షుడిగా సీహెచ్.యల్లయ్య, జిల్లా కార్యదర్శులుగా బి.శంకర్, జి.రవికుమార్‌లు ఎన్నికయ్యారు.

## సంక్షిప్త సమాచారం

**చెగువేరా వర్ధంతి..హాలియా:** హాలియాలో విప్లవకారుడు చెగువేరా వర్ధంతి ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించారు. బుధవారం స్థానిక దొడ్డి కొమరయ్య భవనంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆకారపు నరేష్, డివిజన్ కార్యదర్శి కోరే రమేష్ పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. చందు, జానీ, ఈశ్వర్, సాయి పాల్గొన్నారు.

**పంపిణీ... త్రిపురారం:** దసరా పండగ సందర్భంగా గ్రామ పంచాయతీ సిబ్బందికి మహిళలకు రెండు చీరలు, రెండు కండువాలు, 6 సబ్బులు, కొబ్బెర నూనె డబ్బా, పురుషులకు రెండు జతల దుస్తులు, రెండు కండువాలు, 6 సబ్బులు, కొబ్బెర నూనె డబ్బా చొప్పున ఉండే సంచులను ఎంపీడీవో విజయకుమారి బుధవారం పంపిణీ చేశారు. పంచాయతీ కార్యదర్శి కె.రాజేందర్, సిబ్బంది పాల్గొన్నారు.

**చింతపల్లి:** మండలంలోని తీదేడు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం-1లో కార్తికేయ స్వామి అక్షరాభ్యాసం సందర్భంగా తల్లిదండ్రులు మద్రు అర్చన-మీనారావులు చిన్నారులకు పలకలను పంపిణీ చేశారు. అంగన్‌వాడీ ఉపాధ్యాయిని ఎర్రాడి వెంకటమ్మ పాల్గొన్నారు.

**కమిటీని రద్దు చేయాలి.. గుర్రంపోడు:** గుట్టుచప్పుడు కాకుండా వేసిన మండల కమిటీని తక్షణమే రద్దు చేయాలని భారాస మండల నాయకులు డిమాండ్ చేశారు. గుర్రంపోడులో బుధవారం ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడారు. కార్యకర్తల సమక్షంలో జరగాల్సిన ఎన్నికను గుట్టుచప్పుడు కాకుండా కొంతమంది తోనే కమిటీ వేయడాన్ని మేము ఒప్పుకోమని తేల్చి చెప్పారు. పాశం గోపాల్‌రెడ్డి, నాగరాజు, బొజ్జయ్య, మల్లేశం పాల్గొన్నారు.

## విజయదశమి వేడుకలకు ఏర్పాట్లు పూర్తి

దేవరకొండ, న్యూస్‌టుడే: ఈనెల 12న జరిగే విజయదశమి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు దసరా ఉత్సవ కమిటీ ఏర్పాట్లను పూర్తి చేసింది. దేవరకొండ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో శమీ పూజ, సీతా రామలక్ష్మణశత్రుఘ్న హనుమాన్ దర్శన భాగ్యానికి ఏర్పాట్లు పూర్తిచేశారు. ఈ కళాశాల మైదానంలో రావణ సంహార కార్యక్రమం వేలం పాట ద్వారా నిర్వహిస్తారు. గత ఏడాది స్థానిక కౌన్సిలర్ నేనావత్ ప్రవళిక రూ. 680116ల వేలం పాట ద్వారా రావణ సంహార కార్యక్రమం చేపట్టారు. పురపాలిక సంఘం ఛైర్మన్ ఆలంపల్లి నర్సింహ, దసరా ఉత్సవ కమిటీ సభ్యులు పగిడిమర్రి రఘురాములు, ప్రధాన కార్యదర్శి వెంకటేష్, కృష్ణయ్య తదితరులు పరిశీలించారు.


ఏర్పాట్లను పరిశీలిస్తున్న పుర ఛైర్మన్ ఆలంపల్లి నర్సింహ, ఉత్సవ కమిటీ సభ్యులు

## జాగ్రత్తలు పాటించండి

మిర్యాలగూడ గ్రామీణం, న్యూస్‌టుడే: ఇటీవల వేడి, ఉబ్బలాంటి వాతావరణ మార్పులతో వరి పైరును ఆశించే చీడపీడలతో నష్టపోకుండా తగిన యాజమాన్య పద్ధతులు పాటించాలని శాస్త్రవేత్త డాక్టరు చిన్నినాయక్, మండల వ్యవసాయ అధికారి సైదానాయక్ తెలిపారు. మండల పరిధిలోని జప్తీవీరప్పగూడెం గ్రామంలో వరి క్షేత్రాన్ని వారు బుధవారం పరిశీలించి రైతులకు సలహాలు, సూచనలు చేశారు. వ్యవసాయ విస్తరణ అధికారులు షఫీ, రమేష్, రైతులు కర్రావుల శ్రీనివాసరావు, బాలు నాయక్ పాల్గొన్నారు.


జప్తీవీరప్పగూడెంలో రైతులతో కలిసి వరి క్షేత్రాన్ని పరిశీలిస్తున్న శాస్త్రవేత్త డాక్టరు చిన్నినాయక్, అధికారులు

## త్యాగాలను భవిష్యత్తు తరాలకు అందించడమే గొప్ప వరం

మిర్యాలగూడ గ్రామీణం, న్యూస్‌టుడే: కమ్యూనిస్టులకు దక్కే గొప్ప గౌరవం వారి త్యాగాలను భవిష్యత్తు తరాలకు అందించడమేనని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. మండల పరిధిలోని ఐలాపురంలో బుధవారం నిర్వహించిన బనావత్ దీప్లా నాయక్ సంతాప సభకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. దీప్లానాయక్ గ్రామంలోని నిరుపేదల హక్కుల కోసం పోరాడిన వ్యక్తి అని, ఆయన సేవలను కొనియాడారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు వెంకటేశ్వర్లు, సీపీఎం మండల కార్యదర్శి రవినాయక్, మంగారెడ్డి, రామ్మూర్తి, బద్యానాయక్, హనుమా, దత్తు పాల్గొన్నారు.


ఐలాపురంలో నిర్వహించిన సంతాప సభలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి